# భవిష్యత్తు తరాల మనుగడకు 'వ్యర్థాల రీసైక్లింగ్' ప్రక్రియ

## (15 నవంబర్ "జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం" సందర్భంగా)

వ్యర్థాలను మట్టిలో వదిలేయకుండా ఉపయోగించి నూతన ప్రయోజనకర వస్తువులను తయారు చేసే ప్రక్రియను రీసైక్లింగ్ (పునర్వినియోగ ప్రక్రియ) అని పిలుస్తాం. వ్యర్థాలు రేపటి సమాజ అనారోగ్య కారణాలు. వ్యర్థాలతో నేల తల్లి తల్లడిల్లుతున్నది. గరళ వ్యర్థాల కారణంగా వన్యప్రాణులు, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. నేలపై వ్యర్థాల కుప్పలను తగ్గించడం, కాలుష్యాన్ని తగ్గించడం, నీటి వనరుల రక్షణ, శక్తి ఆదా, హరితగృహ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, ఆర్థిక వెసులుబాటు, ఉద్యోగాల కల్పన, కొత్త ఉత్పత్తుల తయారీ లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియను వ్యక్తి నుంచి మొదలై పౌర వ్యవస్థలు, సంస్థలు, ప్రభుత్వాల వరకు అందరూ నిరంతరం కృషి చేయాలి. ఒక టన్ను వ్యర్థ పేపర్‌ను రీసైక్లింగ్ చేయడం ద్వారా పరోక్షంగా వేల చెట్లు, 7,000 గ్యాలెన్ల నీరుకా సమానంగా ప్రయోజనం జరుగుతుందని తేలింది.

జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం:

వ్యర్థాల రీసైక్లింగ్ ప్రక్రియ ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆచరణలో పెట్టడానికి ప్రతి ఏట 15 నవంబర్ రోజు "జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం (నేషనల్ రీసైక్లింగ్ డే)" పాటించడం అమెరికా నుంచి ప్రారంభానికి నేడు విశ్వవ్యాప్తం అవుతున్నది. ప్రస్తుత పౌర సమాజ ఆరోగ్య పరిరక్షణే కాకుండా భవిష్యత్తు తరాల మనుగడకు నేడే రీసైక్లింగ్ పునాదులు పడాలి. రీసైక్లింగ్ ఫలితంగా పర్యావరణం పరిరక్షణ, నేలపై వ్యర్థాల కుప్పలు తగ్గడం, ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, శక్తి పొదుపు, పౌర సమాజ అభివృద్ధి, వన్యప్రాణుల రక్షణ, సహజ వనరుల సంరక్షణ, భూపాల వాయువుల కట్టడి లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియ పట్ల ప్రజల్లో లోతైన అవగాహన కల్పించాలి. వ్యర్థాల నియంత్రణ సూత్రాలుగా రెడ్యూస్ (తగ్గించడం), రీయూజ్ (తిరిగి వాడడం), రీసైక్లింగ్ (నూతన వస్తువుల తయారీ), రెఫ్యూజ్ (తిరస్కరించడం), రీకవర్ (తిరిగి పొందడం), రోట్ (జీవవిచ్ఛిన్నం చేయడం), రీపర్పస్ (మరో పనికి వాడడం) లాంటి ప్రధాన అంశాలు పేర్కొనబడ్డాయి.

ప్లాస్టిక్ కాలుష్యం రానున్న రోజుల్లో ప్రమాదకరంగా మారనుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలో జీవవిచ్ఛిన్నం కావడానికి వందల ఏండ్ల పట్టడం వల్ల ఈ వ్యర్థాలతో వన్యప్రాణులు, జల తరాల మనుగడ ప్రాణాంతకంగా మారింది. రీసైక్లింగ్ అనే ప్రక్రియ మన నిత్య మంత్రం కావాలి. వ్యర్థాలను తగ్గించడం ఇంటి నుంచే మొదలు కావాలి. నేటి వ్యర్థం రేపు మన ప్రాణాలను తీసే ప్రమాదం కూడా ఉందని తెలుసుకోవాలి. రీసైక్లింగ్ ప్రాధాన్యాలను గుర్తించిన విశ్వ పౌర సమాజం ప్రతి ఏట 18 మార్చి రోజు "ప్రపంచ రీసైక్లింగ్ దినం", 27 మార్చి రోజు "శూన్య వ్యర్థాల అంతర్జాతీయ దినం" కూడా పాటించడం జరుగుతుంది.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేస్తూ.. బోట్స్వానా పురోగతికి మీ వంతు కృషి చేయండి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, నవంబర్ 14:బోట్స్వానాలోని మొకొలోడి నేచర్ రిజర్వ్‌ను భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, బోట్స్వానా అధ్యక్షుడు అడ్వకేట్ శ్రీ డూమా గిడియన్ బోకో ఇవాళ (నవంబర్ 13, 2025) ఉదయం సందర్శించారు. 'ప్రాజెక్ట్ చీతా' కింద భారతదేశానికి బోట్స్వానా నుంచి ఎనిమిది చిరుతలను అప్పగించేందుకు ఘూంజీ ప్రాంతం నుంచి విడుదల చేసిన చిరుతలను క్వారంటైన్ చేయటాన్ని ఇద్దరు నాయకులు, ఇరుదేశాల నిపుణులు వీక్షించారు. దీనిద్వారా వన్యప్రాణుల సంరక్షణలో భారత్–బోట్స్వానా సహకారంలో కొత్త అధ్యాయానికి ప్రారంభం అయింది.

బోట్స్వానా ఉపాధ్యక్షుడు గౌరవ న్డబా న్కోసినాథి గౌలతే, అంతర్జాతీయ సంబంధాల శాఖ మంత్రి డాక్టర్ ఫెన్యో బుటాలే వేర్వేరుగా రాష్ట్రపతితో సమావేశమయ్యారు.

న్యూఢిల్లీకి బయలుదేరే ముందు, బోట్స్వానాలోని భారత హైకమిషనర్ గెబోరోన్‌లో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో అక్కడి భారతీయులనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయమంత్రి శ్రీ వి. సోమన్న, పార్లమెంటు సభ్యులు శ్రీ పర్భూభాయ్ నాగర్‌భాయ్ వాసవ, శ్రీమతి డీ కే అరుణ హాజరయ్యారు.

ఉత్సాహంగా సమావేశమైన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి.. వారి సహకారం పట్ల దేశం గర్విస్తుందన్నారు. వారు దేశానికి నిజమైన సాంస్కృతిక రాయబారులని, కష్టపడి పనిచేయటం, నిజాయితీ, సామరస్యం వంటి విలువలు భారత్‌కే కాక, బోట్స్వానాకు గుర్తింపు తెస్తున్నాయని వెల్లడించారు. బోట్స్వానా అభివృద్ధికి సహకారాన్ని కొనసాగిస్తూనే భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఓసీఐ పథకం, ప్రవాసీ భారతీయ దివస్ వంటి కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని, భారతదేశ అభివృద్ధికి వారు చేసిన పనులకు సంబంధించిన అనుభవాలను పంచుకోవాలని కోరారు.

విశ్వాసం, గౌరవం, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలపై భారత్, బోట్స్వానాల సంబంధాలు ఆధారపడి ఉన్నాయని రాష్ట్రపతి అన్నారు. బోట్స్వానా అధ్యక్షుడు బోకోతో జరిగిన చర్చల సందర్భంగా వాణిజ్యం, విద్య, ఆరోగ్యం, డిజిటల్ సాంకేతికత, వ్యవసాయం, పునరుత్పాదక శక్తి వంటి రంగాల్లో ఇరుదేశాలు మరింత సహకరించుకోవాలని నిర్ణయించినట్లు తెలియజేశారు.

ఆఫ్రికా దేశాలయిన అంగోలా, బోట్స్వానా పర్యటనలను విజయవంతంగా ముగించుకుని, రాష్ట్రపతి నవంబర్ 14 ఉదయం న్యూఢిల్లీకి చేరుకుంటారు.

# రైలు వాణిజ్య అనుసంధానాన్ని మెరుగు పరిచేందుకు భారత్, నేపాల్ ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబర్ 14: న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్, నేపాల్ ప్రభుత్వ పరిశ్రమ, వాణిజ్య, సరఫరాల మంత్రి శ్రీ అనిల్ కుమార్ సిన్హా మధ్య నేడు ద్వైపాక్షిక సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో భారత్ నేపాల్ మధ్య ఉన్న రవాణా ఒప్పందానికి సంబంధించిన విధానాలను సవరిస్తూ అంగీకార పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ సవరణ ద్వారా జోగ్బాని (భారత్) బిరత్‌నగర్ (నేపాల్) మధ్య రైలుమార్గం ద్వారా సరుకు రవాణా సులభతరం కానుంది. ఇందులో బల్క్ కార్గో (ప్యాకేజింగ్ లేకుండా పెద్ద మొత్తంలో రవాణా చేసే సరుకు) రవాణా విస్తరణ కూడా ఉంది. ఈ స్వేచ్ఛా విధానం కోల్‌కతా జోగ్బాని, కోల్‌కతా నౌతన్వా (సునౌలి), విశాఖపట్నం నౌతన్వా (సునౌలి) వంటి ప్రధాన రవాణా కారిడార్‌లకు విస్తరించనుంది. తద్వారా రెండు దేశాల మధ్య బహుమాధ్యమ వాణిజ్య అనుసంధానం బలోపేతం అవుతుంది. అంతేగాక ఇతర దేశాలతో నేపాల్ వాణిజ్యం మెరుగుపడే అవకాశం ఉంది.

పైన పేర్కొన్న అంగీకార పత్రం ద్వారా జోగ్బాని–బిరత్‌నగర్ రైలు మార్గం ద్వారా కంటైనర్ సరుకులు, బల్క్ కార్గో రెండిటీ రవాణాకు ప్రత్యక్ష రైలు అనుసంధానం సాధ్యమైంది. ఇది కోల్‌కతా, విశాఖపట్నం ఓడరేవుల నుంచి నేపాల్‌లోని మోరాంగ్ జిల్లాలో ఉన్న నేపాల్ కస్టమ్స్ యార్డ్ కార్గో స్టేషన్‌కు సరుకు రవాణాను సులభతరం చేస్తుంది. భారత ప్రభుత్వ సహాయంతో నిర్మించిన ఈ రైలు మార్గాన్ని 2023 జూన్ 1న భారత్, నేపాల్ ప్రధాన మంత్రులు సంయుక్తంగా ప్రారంభించారు.

ఈ సమావేశంలో సమగ్ర చెక్ పోస్టులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధితో సహా సరిహద్దు అనుసంధానాన్ని, వాణిజ్య సౌకర్యాన్ని పెంపొందించడానికి కొనసాగుతున్న ద్వైపాక్షిక కార్యక్రమాలపై కూడా చర్చించారు. నేపాల్ అంతర్జాతీయ వాణిజ్యంలో గణనీయమైన వాటాను కలిగి ఉన్న భారత్.. ఇప్పటికీ ఆ దేశ అతిపెద్ద వాణిజ్య, పెట్టుబడి భాగస్వామిగా కొనసాగుతోంది. ప్రస్తుత చర్యలు రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలపరచడమే కాకుండా ఇతర దేశాలతో నేపాల్ వాణిజ్య సంబంధాలను కూడా మెరుగుపరిచేందుకు అవకాశం కల్పిస్తాయి.

# వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలి



కామారెడ్డి, నవంబర్ 14:మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా నోడల్ ఆఫీసర్ షేఖ్ సలాం తనిఖీ చేశారు. తనిఖీలు భాగంగా రికార్డ్స్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అర్థ సంవత్సర పరీక్షల నిర్వహణ పరిశీలించారు. అలాగే కళాశాల అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధంగా బోధన చేస్తూ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఫిబ్రవరిలో పరీక్షలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అధ్యాపకులు ముందస్తుగా గ్రామాలకు వెళ్లి పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ను కలవడం సంతోషకరమని, ఇక్కడి అధ్యాపకులను అభినందించారు. అలాగే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు తీసుకురావాలని సూచించారు. కళాశాలలో జరుగుతున్న పనులను అయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యూసుఫ్ హుస్సేన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# డయాబెటిస్ సంపూర్ణ నిర్వహణపై బెంగళూరులోని కేంద్రీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం: ప్రపంచ డయాబెటిస్ డే సందర్భంగా నిర్వహణ

న్యూఢిల్లీ, నవంబర్ 14:మధుమేహం (డయాబెటిస్ మెల్లిటస్)లో కేంద్ర ఆయుష్ శాఖ గుర్తింపు పొందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) అయిన బెంగళూరులోని కేంద్రీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ (సీఏఆర్ఐ).. 2025 నవంబర్ 14న 'మధుమేహ విమర్శ' శీర్షికన ప్రపంచ డయాబెటిస్ దినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మధుమేహం (డయాబెటిస్ మెల్లిటస్) కోసం పరిశోధన, క్లినికల్ సేవల్లో సంస్థ ప్రస్తుత పరిశోధన, చికిత్సాపరమైన పనులు, ప్రజలకు చేరువయ్యేలా చేపట్టిన చర్యలను ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తారు.

ఆయుర్వేదం, యోగా, జీవనశైలి అంశాల ద్వారా డయాబెటిస్ నివారణ, నిర్వహణ కోసం సమగ్ర విధాన అభివృద్ధి, అమలుపై ఈ కేంద్రం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఇప్పటివరకు దాదాపు 6,000 మంది రోగులు సంస్థలో సేవలను పొందారు. వారిలో 25 శాతం కన్నా ఎక్కువ మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) వారే.

చికిత్సాపరమైన సంరక్షణతో పాటు.. డిజిటల్ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా ఈ కేంద్రం ప్రజలకు మరింత సమర్థంగా చేరువవుతోంది. ఇ–మెడికల్ రికార్డులు, టెలికన్సల్టేషన్లు, ఎస్ఎంఎస్ అలర్టులు, వెబ్‌సైట్ సామాజిక మాధ్యమ వేదికల్లో అందుబాటులో ఉన్న సమాచారం ద్వారా 6 లక్షల మందికి పైగా ప్రయోజనం చేకూరుస్తోంది.

మధుమేహం ప్రమాదాన్ని అంచనా వేయడం కోసం ఓ 'మెషీన్ లెర్నింగ్' ఆధారిత అంచనా వ్యవస్థను కూడా ఈ కేంద్రం అభివృద్ధి చేసింది. దీనికి ప్రస్తుతం కాపీరైట్ హక్కులు కూడా లభించాయి. ప్రస్తుతం ఈ వ్యవస్థను ఓ వెబ్ ఆధారిత అప్లికేషన్‌ను ఉపయోగించి ధ్రువీకరిస్తున్నారు. వ్యక్తులు తమ ఆరోగ్యాన్ని మరింత సమర్థంగా పర్యవేక్షించుకోవడానికి వీలుగా మొబైల్ యాప్‌గా దీనిని అభివృద్ధి చేస్తారు.

కార్యక్రమానికి ముందు సీఏఆర్ఐ ఇన్చార్జి డాక్టర్ సులోచనా భట్ మాట్లాడుతూ.. "సాంప్రదాయక వైద్య పరిజ్ఞానాన్ని శాస్త్రీయ పరిశోధనతో మేళవించి.. ప్రామాణికంగా మధుమేహ సమస్యను సంపూర్ణంగా పరిష్కరించడంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాం. ప్రమాదం బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్న వ్యక్తులకు 'సమగ్ర ఆరోగ్య సంరక్షణ' ఎలా చేయూతనిస్తుందో, వారి జీవన నాణ్యతను ఎలా మెరుగుపరుస్తుందో ఈ కేంద్రం చేపట్టిన కార్యక్రమాలు ప్రతిబింబిస్తున్నాయి" అన్నారు.

ఎంపిక చేసిన ఆహార ఉత్పత్తులు, ఆయుర్వేద సూత్రీకరణలపై సీఎస్ఐఆర్–సీఎఫ్‌టీఆర్ఐ–మైసూరు, ఐఐఎస్సీ– బెంగళూరుతో సహకార అధ్యయనాలు కొనసాగుతున్నాయి. మధుమేహం నివారణ, నిర్వహణ కోసం అభివృద్ధి చేసిన సమగ్ర ఫ్రేమ్‌వర్క్ ప్రచురణకు సిద్ధంగా ఉంది. అదేవిధంగా ప్రకృతి, డయాబెటిక్ పెరిఫెరల్ న్యూరోపతీపై ఓ అధ్యయనం కూడా ప్రచురణలో ఉంది.

రేపటి కార్యక్రమంలో 'మధుమేహ సంపూర్ణ నిర్వహణ', తదితర అంశాలపై రమియా ఇండిక్ స్పెషాలిటీ ఆయుర్వేద రీస్టోరేషన్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) జి.జి. గంగాధరన్ ప్రసంగిస్తారు.

డయాబెటిస్ వంటి జీవనశైలి సంబంధిత రుగ్మతల నిర్వహణ కోసం సుస్థిర, సమ్మిళిత, ప్రామాణిక వ్యూహాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో పరిశోధన, చికిత్సాపరమైన కార్యక్రమాలను ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రోత్సహిస్తోంది.

# సమస్యలు సృష్టించడం సరికాదు

ఊట్కూర్, నవంబర్ 14: నారాయణపేటజిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం క్రీడామైదానం పనులు అడ్డుకోవడం సరైంది కాదని ఊట్కూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోరం మహేష్ రెడ్డి అన్నారు.

ఈ రోజు ఊట్కూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి క్రీడాభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఆర్డీఓ తాసిల్దారులతో కలిసి పరిశీలించగా అఖిలపక్షం నాయకులు క్రీడా మైదానానికి సహకరిస్తామని మంత్రి వెళ్ళిన తర్వాత కొంతమంది నాయకులు క్రీడామైదానం పనులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. క్రీడా మైదానం పనుల్లో హిందూ ముస్లింల మధ్య సమస్య సృష్టించడం సరి కాదన్నారు.

ఊట్కూర్ మండల కేంద్రంలో గత పాలకుల నిర్లక్ష్యం క్రీడా మైదానం ఏర్పాటుకు నోచుకోలేదని మంత్రి స్వయంగా క్రీడామైదానం కోసం మూడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అధికారులను ఆదేశిస్తే పనులు నిలిపివేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి ,మంత్రికి మంచి పేరు వస్తుందని రాజకీయ కుట్రతో పరోక్షంగా పనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఊట్కూర్ మండల కేంద్రంలో క్రీడా మైదానానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# వరి రైతులకు సంచులు ఇవ్వాలి

## –కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలకు చెక్ పెట్టాలి



నారాయణపేట ,నవంబర్ 14: వరి కొనుగోలు కేంద్రాల్లో అవకతకాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులకు నేరుగా ఖాళీ వడ్ల సంచులు అందించాలని తెలంగాణ రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ ఏ. ఓ. శ్రీధర్ కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు కల్లాల దగ్గరికి తీసుకెళ్లడానికి కావాల్సిన ఖాళీ సంచులు ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని, దీంతో రైతులు అదనపు రవాణా ఛార్జీలు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల భారం తగ్గించడానికి కల్లాల వద్ద నుంచే కేంద్రాల వరకు ధాన్యాన్ని తీసుకురావడానికి అవసరమైన ఖాళీ సంచులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. గతంలో కొన్ని సందర్భాలలో రైస్‌మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కై 'తరుగు, తాలు' పేరుతో అధిక కాటాలు వేసి రైతులను నష్టపరిచిన విషయాలను గుర్తు చేశారు.

ఇలాంటి దోపిడీ చర్యలు పునరావృతం కాకుండా కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ చేపట్టాలని, రైస్‌మిల్లుల్లో వినియోగిస్తున్న కాటాలు సరిచూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, దస్తప్ప, మల్లేష్, హన్మంతు, బింపూర్ హన్మంతు, నరహరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# ఏసీబీ సడన్ ఎంట్రీ..

## –డాక్యుమెంట్ రైటర్ల పరుగులు

మంచిర్యాల నవంబర్ 14: మంచిర్యాల జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏసీబీ అధికారుల ఆకస్మిక తనిఖీ సంచలనం సృష్టించింది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఏసీబీ డీఎస్పీ మధు నేతృత్వంలోని అధికారుల బృందం సబ్ రిజిస్టర్ కార్యాలయానికి చేరుకుంది.

ఒకసారిగా కార్యాలయం లోపలికి వెళ్లి డాక్యుమెంట్లు పరిశీలించడంతో పాటు.. రిజిస్ట్రేషన్ జరుగుతున్న ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మధు మీడియాతో మాట్లాడుతూ ఏసీబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వసాధారణంగా తనిఖీ చేయడానికి వచ్చామని వెల్లడించారు. స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇతర శాఖలకు సంబంధించిన అంశాలను కూడా చెక్ చేయడానికి వచ్చామని చెప్పారు.

డాక్యుమెంట్ రైటర్ల పరార్..!

ఏసీబీ బృందం వచ్చిందన్న సమాచారం తెలిసిన వెంటనే అక్కడి డాక్యుమెంట్ రైటర్లు ఒక్కసారిగా దుకాణాలను బంధ్ చేసి పారిపోయడం కలకలం రేపింది. సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న 33 మంది డాక్యుమెంట్ రైటర్లు తక్షణమే దుకాణాలు మూసివేసి పరారయ్యారు.

# 44వ భారత అంతర్జాతీయ వాణిజ్య సదస్సులో స్వదేశీ రక్షణ శక్తిని ప్రదర్శించనున్న డీడీపీ

న్యూఢిల్లీ, నవంబర్ 14:2025 నవంబర్ 14 నుంచి 27 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే 44వ భారత అంతర్జాతీయ వాణిజ్య సదస్సు (ఐఐటీఎఫ్)లో రక్షణ ఉత్పత్తి విభాగం (డీడీపీ), ఒక పెవిలియన్ ను ఏర్పాటు చేయనుంది. ఆత్మనిర్భర్ భారత్ ద్వారా సాధించిన కీలక మార్పును ఇది స్పష్టం చేస్తుంది. రక్షణ తయారీ వ్యవస్థకు పెరుగుతున్న సామర్థ్యం, ఆవిష్కరణ, స్వావలంబనను ప్రదర్శిస్తుంది.

భూవ్యవస్థలు, నౌకాదళ వేదికలు, గగనతలం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత వంటి రంగాల్లో అత్యాధునిక ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికతలు, ఆవిష్కరణల విస్తృతశ్రేణిని ప్రదర్శించనున్నారు. 16 రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు (డీపీఎస్‌యూలు), ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్ (ఐడెక్స్) నుంచి రక్షణ విభాగానికి చెందిన అంకుర సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయి.

భారత స్వదేశీ రక్షణ సామర్థ్యాలపై అవగాహన పెంపొందించటం, పరిశ్రమల సహకారాలను ప్రోత్సహించటం, విస్తృత ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సాధారణ ప్రజలతో అనుసంధానం కావటమే డీడీపీ పెవిలియన్ లక్ష్యం.

# నాణ్యమైన బంగాళాదుంప విత్తనోత్పత్తి...వాణిజ్యం బనాస్ డెయిరీ, బీబీఎస్ఎస్ఎల్ మధ్య అవగాహనా ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబర్ 14:'సహకారం ద్వారా అభివృద్ధి' అనే ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనకు అనుగుణంగా ఈ ఒప్పందం జరిగింది. 'సహకార సంస్థలు పరస్పరం తోడ్పాటునందించుకోవాలి' అనే ప్రభుత్వ లక్ష్యాన్ని ఇది ముందుకు తీసుకెళ్తుంది.

బంగాళాదుంపల ఉత్పత్తికి విత్తనం నుంచి మార్కెటింగ్ వరకు సమగ్రమైన వ్యవస్థను అభివృద్ధి చేయటం ఈ ఎంఓయూ లక్ష్యం.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచన 'సహకారం ద్వారా అభివృద్ధి'ని సాకారం చేసేందుకు సహకార సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ హోం, సహకారశాఖ మంత్రి శ్రీ అమిత్ షా నాయకత్వంలో నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ దిశగా అత్యుత్తమ నాణ్యత గల విత్తన బంగాళాదుంపలను ఉత్పత్తి చేసి, పంపిణీ చేసేందుకు బనాస్ డెయిరీ (ఆసియాలోనే అతిపెద్ద సహకార డెయిరీ– అమూల్ అనుబంధ సంస్థ), భారతీయ విత్తన సహకార సమితి (బీబీఎస్ఎస్ఎల్) కలిసి అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకం చేశాయి. 2025 నవంబర్ 10న న్యూఢిల్లీలోని అటల్ అక్షయ్ ఉర్జాభవన్‌లో ఈ ఒప్పందం జరిగింది. భారత ప్రభుత్వ కార్యదర్శి (సహకార) డాక్టర్ ఆశీష్ కుమార్ భూటాని, ఇతర సీనియర్ అధికారుల సమక్షంలో.. బనాస్ డెయిరీ ఎండీ శ్రీ సంగ్రామ్ చౌదరి, బీబీఎస్ఎస్ఎల్ ఎండీ శ్రీ చేతన్ జోషి ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఆశిష్ కుమార్ భూటాని మాటాడుతూ.. విలువ వ్యవస్థలను బలోపేతం చేయటం, ఉత్పాదకతను పెంచటం ద్వారా రైతుల సాధికారత, అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలకమని తెలిపారు.

విత్తనం నుంచి మార్కెట్ వరకు బంగాళాదుంప విలువాధారిత వ్యవస్థను సమగ్రంగా ఏర్పరచటమే ఈ భాగస్వామ్యం లక్ష్యం. ధ్రువీకరించిన, మేలైన బంగాళదుంప విత్తనాల ఉత్పత్తిని ఇది నిర్ధారించటమే కాక, శాస్త్రీయ సాగు పద్ధతులు, కాంట్రాక్ట్ వ్యవసాయ ఒప్పందాలు, సమర్థవంతమైన మార్కెట్ అనుసంధానాలను ప్రోత్సహిస్తుంది. సాంకేతికతను సహకారంతో జోడించి, విలువ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, పెట్టుబడి నష్టాలను తగ్గించటం వల్ల బంగాళాదుంపలు పండించే రైతుల ఆదాయం, ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరచటానికి ఈ కార్యక్రమం కృషి చేస్తుంది. ఈ ఎంఓయూ ప్రకారం బనాస్ డెయిరీ కణజాల వర్ధనం, ఏరోపోనిక్ సౌకర్యాలను బీబీఎస్ఎస్ఎల్ సంస్థ వినియోగించుకుంటుంది. అదే సమయంలో బనాస్ డెయిరీ సాంకేతికత, మార్కెట్ మద్దతును అందిస్తుంది. పాల ఉత్పత్తికి మించి బనాస్ డెయిరీ విస్తరణపై శ్రీ సంగ్రామ్ చౌదరి ప్రస్తావించగా, విత్తన బంగాళాదుంప స్వావలంబనపై శ్రీ చేతన్ జోషి మాట్లాడారు.

# కర్నూలులో రిలయన్స్ గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్



అమరావతి, నవంబర్ 14: విశాఖపట్నం లో జరుగుతున్న భాగస్వామ్య సదస్సు సందర్భంగా పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించింది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఈడీ ఎంఎస్ ప్రసాద్, సౌత్ ఇండియా మెంటార్ మాధవరావు సమావేశమయ్యారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో 1 జిగా బైట్ ఏఐ డేటా సెంటర్, 6 జి డబ్ల్యుఎఫ్ సౌర విద్యుత్ ప్రాజెక్టు, ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఫీల్డ్ ఫుడ్ పార్క్ ఏర్పాటుకు భారీ పెట్టుబడులు పెట్టడానికి ఆ సంస్థ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఫీల్డ్ ఫుడ్ పార్క్‌ను కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసేందుకు సానుకూలత వ్యక్తం అయినట్టు తెలుస్తోంది.

కర్నూలులో 170 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు అయ్యే గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను నిర్మితం అవుతుంది ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సౌ కర్యాలతో ఏర్పాటు అయ్యే ఆ ఫుడ్ పార్క్ వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ అవకాశాలు ఎక్కువగా కలగనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగావకాశాలు, టెక్నాలజీ, పవర్, అగ్రికల్చర్ అన్ని రంగాలలోనూ యువతకు ఉపాధి మార్గాలు లభించనున్నాయి.

# మోసపూరితంగా రూ. 645 కోట్ల ఐటీసీ ప్రయోజనం పొందిన ముఠా గుట్టురట్టు కీలక వ్యక్తిని అరెస్టు చేసిన అధికారులు

న్యూఢిల్లీ, నవంబర్ 14:229 నకిలీ జీఎస్టీ నమోదిత సంస్థల ద్వారా మోసపూరితంగా ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) ప్రయోజనాలు పొందుతున్న ఢిల్లీకి చెందిన ఒక భారీ ముఠాను జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీజీఐ) ఢిల్లీ జోనల్ యూనిట్ పట్టుకుంది.

విశ్వసనీయ సమాచారం మేరకు డీజీజీఐ అధికారులు ఢిల్లీలోని పలు ప్రాంగణాల్లో సమన్వయంతో సోదాలు నిర్వహించారు. వస్తుసేవల వాస్తవ సరఫరా లేకుండానే ఇన్‌వాయిస్‌లు జారీ చేస్తున్న బోగస్ సంస్థలకు సంబంధించిన దస్త్రాలు, డిజిటల్ పరికరాలు, లెడ్జర్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో జీఎస్టీ లేదా బ్యాంకింగ్ అవసరాల కోసం ఓటీపీలు పొందడానికి ఉపయోగించిన 162 మొబైల్ ఫోన్లు, 44 డిజిటల్ సంతకాలు, వివిధ సంస్థల 200కు పైగా చెక్ బుక్‌లు ఉన్నాయి. ఈ బోగస్ సంస్థలు వస్తువులను సరఫరా చేయకుండానే ఇన్‌వాయిన్‌లు ఇచ్చాయని ప్రాథమికంగా దర్యాప్తులో తేలింది. దీని ఫలితంగా దాదాపు రూ. 645 కోట్ల అర్హత లేని ఐటీసీ మోసం జరిగింది. ఇది ప్రభుత్వ ఖజనాకు నష్టాన్ని కలిగించింది.

ఈ నకిలీ సంస్థల నెట్‌వర్క్ కార్యకలాపాలను ముఖేష్ శర్మ అనే వ్యక్తి ప్రధాన పాత్ర పోషించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నకిలీ సంస్థల జీఎస్టీ రిజిస్ట్రేషన్లు, రిటర్నులు, రికార్డులను నిర్వహించడం, బ్యాంకింగ్ లావాదేవీలను నిర్వహించడం, బహుళ స్థాయిలలో చట్టవిరుద్ధంగా నిధులు పొందడంలో ఇతను చురుకైన పాత్ర పోషించినట్లు ఆధారాలు లభించాయి. ముఖేష్ శర్మ చేసిన నేరాలు బెయిల్ పొందడానికి వీల్లేనివి. 2017 నాటి సీజీఎస్టీ చట్టంలోని 132(1)(బి), 132(1)(సి) సెక్షన్ల కింద 2025 నవంబర్ 11న అతన్ని అరెస్టు చేశారు.

ఈ దర్యాప్తులో మనీలాండరింగ్‌కు సంబంధించిన కోణం కూడా వెలుగులోకి వచ్చింది. మోసపూరితంగా వచ్చిన మొత్తాన్ని ఒక ఎన్జీఓ, ఒక రాజకీయ సంస్థ ద్వారా నగదును దారిమళ్లించినట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# అత్యాధునిక కమాండ్ సెంటర్



చిత్తూరు, నవంబర్ 14:జిల్లాలో ప్రజల భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి చిత్తూరు జిల్లా పోలీసులు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ సెంటర్ పనితీరును పరిశీలించడానికి జిల్లా పోలీసు అధినేత తుషార్ డూడి ఈ రోజు చిత్తూరు పట్టణంలోని కమాండ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరా నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, అత్యవసర ప్రతిస్పందన విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. నగరంలోని ముఖ్యమైన స్థలాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాల దృశ్యాలను లైవ్గా చూసి, వాటి పనితీరు గురించి సిబ్బంది నుండి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యొక్క శక్తి యాప్పపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మహిళలు లేదా బాలికలు అత్యవసర స్థితిలో యాప్ప ద్వారా ఎస్‌ఓఎస్ సంకేతాన్ని పంపితే, అది కంట్రోల్ సెంటర్లో వెంటనే రిసీవ్ అవుతుందని, ఆ తర్వాత సంబంధిత అధికారులకు తక్షణమే సమాచారం చేర్చడం ద్వారా త్వరితగతిన నివారణ చర్యలు తీసుకోవడానికి వీలు కల్పిస్తామని పోలీసులు వివరించారు. శక్తి యాప్పలోని ఎస్‌ఓఎస్ సంకేతం, మహిళలు మరియు బాలికలకు రక్షణ కవచంగా పనిచేయాలని జిల్లా పోలీసు అధినేత తెలిపారు.

పోలీస్ డయల్ 112 డయల్ 112 విభాగాన్ని పరిశీలించారు. ప్రజలకు అత్యవసర పోలీసు, వైద్య, అగ్నిమాపక సేవలను అందించే ఈ నంబర్కు వచ్చే ప్రతి కాల్కూ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కమాండ్ సెంటర్లోని సిబ్బంది, డయల్ 112 సిబ్బంది మరియు గస్తీ వాహనాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. ప్రతి అత్యవసర కాల్ ఒక ప్రాణాంతక పరిస్థితిని సూచిస్తుంది. స్పందన సమయాన్ని తగ్గించి, బాధితులకు తక్షణ సహాయం అఈ కార్యక్రమంలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, సబ్-ఇన్స్పెక్టర్లు సురేంద్ర, మోబీన్ తాజ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా పోలీసులు రోజుకు 24 గంటలు, వారానికి 7 రోజులు ప్రజారక్షణ సేవలను అందించడం తమ దృఢమైన సంకల్పం అని పేర్కొన్నారు.

# గ్లోబల్ ఎనర్జీ లీడర్స్ సమ్మిట్ (జీఈఎల్ఎస్) 2025 లోగో, వెబ్ సైట్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, నవంబర్ 14:న్యూఢిల్లీలో నేడు ప్రపంచ ఇంధన నేతల సదస్సు (జీఈఎల్ఎస్) 2025 లోగో, వెబ్‌సైట్‌ను విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపద్ నాయక్ ప్రారంభించారు. టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ సంస్థతో కలిసి ఒడిశా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సమావేశం.. డిసెంబర్ 5 నుంచి 7 వరకు పూరీ నగరంలో జరగనుంది.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒడిశా ఉపముఖ్యమంత్రి శ్రీ కనక్ వర్ధన్ సింగ్ డియో, ఒడిశా విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీ విశాల్ దేవ్, ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ అనూప్ సింగ్, టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ (భారత్) అధినేత శ్రీవివేక్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఇంధన మార్పు, వాతావరణ నాయకత్వం, సాంకేతిక ఆధారిత మార్పులపై కీలక జాతీయ, అంతర్జాతీయ సంభాషణకు ఈ జీఈఎల్ఎస్ 2025 నాంది పలుకుతుందని కేంద్ర సహాయ మంత్రి శ్రీ శ్రీపద్ నాయక్ తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధనం, ప్రసార సామర్థ్యం, డిజిటల్ ఆధునీకరణలో దేశ ప్రగతిని ప్రస్తావిస్తూ.. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంధన మార్కెట్లలో భారత్ ఒకటిగా పేర్కొన్నారు.

దేశ ఇంధన పరివర్తనను ముందుకు తీసుకెళ్లడంలో, సహకార, పోటీతత్వ సమాఖ్యవాదాన్ని ప్రోత్సహించడంలో నాయకత్వం వహిస్తున్న ఒడిశా ప్రభుత్వాన్ని నాయక్ ప్రశంసించారు.

1990లోనే విద్యుత్ రంగ సంస్కరణలు చేపట్టిన దేశంలోని తొలి రాష్ట్రంగా ఒడిశా నిలిచిందని మంత్రి ప్రశంసించారు. సమర్థత, స్థైర్యం, స్థిరత్వం పట్ల బలమైన నిబద్ధతను రాష్ట్రం కొనసాగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఒడిశా మోడల్ ద్వారా వృద్ధి, పర్యావరణ బాధ్యతతో సమన్వయం సాధించగలదని, స్వచ్ఛమైన ఇంధన పెట్టుబడులు పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి సృష్టికి దోహదపడతాయని చూపించిందని తెలిపారు.

ఈ సదస్సు ఇతివృత్తం.. "శక్తిమంతమైన భారత్: సమృద్ధి, సమతుల్యత, ఆవిష్కరణ" గురించి కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ఇంధన ప్రాప్యత, సమర్థత, స్థిరత్వం, భద్రత వంటి నాలుగు కీలక అంశాలతో ప్రధానమంత్రి దార్శనికతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ సదస్సుకు విద్యుత్ మంత్రిత్వ శాఖ, నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ నుంచి పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. జీఈఎల్ఎస్ సమావేశం ఇంధన నాయకత్వం, సహకార వేదికగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జీఈఎల్ఎస్ సదస్సును విజయవంతంగా నిర్వహించాలని కోరుతూ.. ఒడిశా ప్రభుత్వం, రాష్ట్ర విద్యుత్ శాఖ, అన్ని భాగస్వామ్య సంస్థలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి సహకార ప్రయత్నాలు దేశ "శూన్య నికర ఉద్గారాలు-2070" లక్ష్యాలు, జాతీయంగా నిర్ణయించిన వాతావరణ చర్యల లక్ష్యాలను సాధించడంలో కీలకమని ఆయన పేర్కొన్నారు.

డిసెంబర్ 5 నుంచి7 వరకు ఒడిశాలోని పూరిలో ప్రపంచ ఇంధన నేతల సదస్సు 2025 జరగనుంది. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రులు, ప్రపంచ నేతలు, ఆవిష్కర్తలు, పరిశ్రమ దిగ్గజాలు పాల్గొననున్నారు. భవిష్యత్తు ఇంధన విధానాలను, ఆవిష్కరణలను, స్థిరమైన అభివృద్ధిని అందించే వేదికగా ఈ కార్యక్రమం ఉండనుంది.

ఈ సదస్సు రాష్ట్ర విద్యుత్ మంత్రుల మధ్య సహచర చర్యలను ప్రోత్సహించేలా, అంతర్జాతీయ నాయకులతో వ్యూహాత్మక సంభాషణలను నిర్వహించేందుకు ఓ అవకాశంగా ఉపయోగపడనుంది. మరిన్ని వివరాల కోసం జీఈఎల్ఎస్ 2025 అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# ఐఐటీఎఫ్-2025లో గనుల శాఖ ప్రదర్శనశాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, నవంబర్ 14:ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్ (ఐఐటీఎఫ్) 2025ను ఈ నెల 14న న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్లో నిర్వహించనున్నారు. ఐఐటీఎఫ్-2025లో గనుల శాఖ ప్రదర్శనశాలను బొగ్గు, గనుల శాఖ కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు.

భారతదేశంలోని అపార ఖనిజ వనరులనీ, మన దేశం సాధిస్తున్న సాంకేతిక అభివృద్ధినీ, వికసిత్ భారత్ - ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడానికి గనుల శాఖ అందిస్తున్న తోడ్పాటునీ ఈ ప్రదర్శనశాల కళ్లకు కడుతుంది.

దీనిని 1,500 చదరపు మీటర్లకు పైగా ప్రదేశంలో ఏర్పాటు చేశారు. ఇది సందర్శకులకు అనేక విషయాలను తెలియజేస్తుంది. దీనిలో ఇతివృత్త ప్రధాన అంశాలు, సందర్శకులు స్వయంగా పాల్గొనేందుకు వీలుండే కార్యక్రమాలు, గనుల తవ్వకంలో, ఖనిజ రంగంలో భారత్ సాధించిన విజయాలతో పాటు భావి కార్యాచరణ ప్రణాళికలనూ అందిస్తారు.

కేంద్ర ప్రభుత్వ రంగ వాణిజ్య సంస్థలు (సీపీఎస్ఈల), మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థలు, ఈ శాఖ సహాయక సంస్థలతో పాటు ఈ శాఖ అధీనంలో పనిచేస్తున్న స్వతంత్ర ప్రతిపత్తి సంస్థలన్నీ దీనిలో పాలు పంచుకుంటాయి. ఇందులో నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో), హిందుస్తాన్ కాపర్ (హెచ్‌సీఎల్), భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ (జీఎస్ఐ), మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీ (ఎంఈసీఎల్), జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రిసర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ (జేఎన్ఏఆర్‌డీడీసీ)తో పాటు నేషనల్ రాక్ మెకానిక్స్ ఇన్స్టిట్యూట్ (ఎన్ఐఆర్ఎమ్) ఉన్నాయి.

జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్‌సీఎమ్ఎమ్) చేసిన కృషిని ప్రదర్శనశాలలోని ఒక జోన్లో ప్రత్యేకంగా వివరిస్తారు. భారత కీలక ఖనిజాల అనుబంధ విస్తారిత వ్యవస్థను పటిష్ఠపరచడానికి గనుల శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న ఒక ప్రధాన కార్యక్రమమే ఎన్‌సీఎమ్ఎమ్. ఈ విభాగం నాన్-ఫెర్రస్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎఫ్‌టీడీసీ) కార్యకలాపాల్ని వెల్లడిస్తుంది. దేశ స్వచ్ఛ ఇంధన రంగం, పారిశ్రామిక రంగం వృద్ధి చెందడంలో ముఖ్య పాత్ర పోషించే కీలక ఖనిజాలు, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణకూ, శుద్ధికీ, వినియోగానికీ మద్దతిచ్చే సాంకేతిక నవకల్పనలతో పాటు ఈ దిశగా సాధించిన ప్రధాన విజయాలను కూడా ఈ విభాగాన్ని చూసి తెలుసుకోవచ్చును.

హిందాల్కో ఇండస్ట్రీస్, హిందుస్తాన్ జింక్ (హెచ్‌జడ్ఎల్) వంటి ప్రయివేటు రంగ భాగస్వామ్య సంస్థలు కూడా నవకల్పనలనూ, తాము అందిస్తున్న సేవలనూ తెలియజేస్తాయి.

హిందాల్కో వందే భారత్ ఎక్స్‌ప్రెస్, చంద్రయాన్-3 నమూనాలను ప్రదర్శిస్తుంది. భారత్‌ను ప్రగతిపథంలో శరవేగంగా ముందుకు నడపడంలో లోహాలు పోషిస్తున్న పాత్రకు ఈ సంస్థ స్టాల్ ఒక ప్రతీకగా ఉంటుంది.

హెచ్‌జడ్ఎల్ గనుల తవ్వకాన్ని లాభసాటి వాణిజ్యంగా తీర్చిదిద్దిన అంశంలో సాధించిన విజయాలతో పాటు సాంకేతికత పరంగా సాధించిన అత్యుత్తమ ఫలితాలను సందర్శకులకు తెలియజేస్తుంది.

ఇక డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్లు (డీఎంఎఫ్‌లు), స్వయంసహాయ బృందాలు ప్రదర్శించే అంశాలు సామాజిక అభివృద్ధికి తోడ్పడుతున్న కార్యక్రమాలతో పాటు, గనుల రంగం నుంచి సీఎస్ఆర్ రూపేణా సాయాన్ని అందుకొని స్థానికంగా తయారు చేసిన ఉత్పత్తులను గురించి వివరిస్తాయి.

గనుల తవ్వకంతో సంబంధం గల అనుభూతులను వర్చువల్ రియాలిటీ (వీఆర్), డిజిటల్ మాధ్యమాల ద్వారా సందర్శకులు సొంతం చేసుకోవచ్చు. విద్యార్థులు, యువత స్వయంగా పాలుపంచుకునేందుకు వీలుండే క్విజ్ కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. కీలక ఖనిజాలు, అన్వేషణకు ఉపయోగించే సాంకేతికతలు, దీర్ఘకాలిక ప్రయోజనాలను అందుకొనే దృష్టితో చేపడుతున్న నవకల్పనలకు సంబంధించిన ప్రదర్శనలు కూడా చోటుచేసుకుంటాయి.

బాధ్యతల పట్ల స్పృహ కలిగి ఉంటూ గనుల తవ్వకాన్ని కొనసాగించడంతో పాటు నవకల్పనలను ప్రోత్సహిస్తూ, సమ్మిళిత అభివృద్ధినీ, ఖనిజాల రంగంలో స్వయంసమృద్ధినీ సాధించే దిశగా 2047 కల్లా వికసిత్ భారత్ ఆశయ సాధనకు సహకరించాలన్న మంత్రిత్వ శాఖ నిబద్ధతకు ఈ ప్రదర్శనశాల అద్దం పడుతుంది.

# మహిళా భాగస్వామ్యంతోనే సమ్మిళిత వృద్ధి



అమరావతి, నవంబర్ 14:ఏదైనా ప్రదేశంలో పనిచేస్తున్న మహిళలు భద్రతా భావాన్ని కలిగిఉండి వారి భాగస్వామ్యాన్ని మెరుగు పరిస్తే అక్కడ ఆర్థిక సాధికారత మరియు సమ్మిళిత వృద్ధి జరుగుతుందని వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి. కీర్తి అన్నారు. దేశంలో పని ప్రదేశాలలో POSH చట్టం (లైంగిక వేధింపుల నిరోధక చట్టం) మహిళలపై లైంగిక వేధింపులు, నియమాలపై అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఉద్యోగులకు, సిబ్బందికి శుక్రవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని మహిళలకు పనిచేసే చోట సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం - 2013 లక్ష్యం అన్నారు.

మహిళా ఉద్యోగినులు తమ ప్రాథమిక హక్కులైన స్వేచ్ఛ, సమానత్వం, జీవించే హక్కులను ఉపయోగించుకోవడానికి ఈ చట్టం తోడ్పడుతుంది. అదేవిధంగా ప్రతిచోటా పని పరిస్థితులలో లింగ సమానత్వం, జీవితం, స్వేచ్ఛ, సమానత్వంపై వారి హక్కును గ్రహించడానికి దోహదం చేస్తుందన్నారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నుంచి రక్షించబడటానికి పోష్ చట్టం పదునైన ఆయుధంగా తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు తదితర రంగాలలో యజమానులు నిర్వహణ, పర్యవేక్షణ, కార్యాలయ నియంత్రణ మరియు విధానాల రూపకల్పనకు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. భారత రాజ్యాంగంలో హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కులలో లింగ సమానత్వం తగినంత విస్తృతిని కలిగి ఉందన్నారు. భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం లైంగిక వేధింపులను నిర్వచించి, యజమానుల బాధ్యతలను వివరిస్తూ మార్గదర్శకాలను రూపొందించిందన్నారు. పని ప్రదేశంలో స్త్రీ లైంగిక వేధింపులకు గురైనా పోష్ చట్టం రక్షణ కవచంలా నిలుస్తోందన్నారు.

ఏడీసీ జనరల్ మేనేజర్ కె.శ్రీహరి మాట్లాడుతూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)ని స్వయం వంతంగా నిర్వహిస్తున్నామన్నారు. సంబంధిత ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, పరిష్కరించడానికి ఏర్పాటు చేయబడిన కమిటీని నియమించామన్నారు. ఈ కార్యశాలలో ఏడీసీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎల్ఎస్వి భవన్నారాయణ, ఐసీసీ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ వాణి ఫణిశ్రీ, ఐసీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక సహకార సంఘాలు

వరంగల్, నవంబర్ 14: సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ రోజు 72 వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా రేగొండ ప్రాథమిక సహకార కార్యాలయంలోని జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. సహకార వ్యవస్థ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తోందని అన్నారు. రైతు, కార్మికుడు, అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం సహకార రంగాన్ని మరింత బలోపే తం చేయడానికి పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు. వెంకటేశ్వరరావు, రామ్ ప్రసాద్, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్. గుటోజు కిష్టయ్య, పిఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, సీఈఓ. జగన్, నాయకులు. ఇప్పకాయల నర్సయ్య, ఆయా మండ లాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి స్వాతంత్ర ఫలాలు అందాలి..



జైనూర్, నవంబర్ 14: సమాజంలోని అణగారిన వర్గాల ఆశాజ్యోతి స్వాతంత్ర సమరయోధులు క్రాంతి వీర్ లావుజీ సాల్వే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు.

ఈరోజు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని గణేష్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సాహిత్య సామ్రాట్ క్రాంతి వీర్ లావుజీ సాల్వే 231 వ జయంతి కార్యక్రమాన్ని అన్నా బౌసాట్టే కొమరం భీమ్ జిల్లా అధ్యక్షుడు మావాలే దత్త ఆధ్వర్యంలో మాంగ్ సమాజ్ నాయకులు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ నాయకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా లావుజీ సాల్వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ విశ్వనాత్ రావు మాట్లాడుతూ.. మహనీయుల అడుగుజాడల్లో యువత పయనించాల్సిన అవసరముందన్నారు. స్వాతంత్ర సమర యోధుల స్ఫూర్తి తో కాంగ్రెస్ పార్టీ జై భీం, జై సంవిధాన్, జై బాపు నినాదంతో ప్రతి ఒక్కరికి స్వాతంత్ర పలాలు అందాలని కృషి చేస్తుందని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ హన్నుపటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, నాయకులు మెస్రం అంబాజీ రావు, పెందుర్ ప్రకాష్, కోట్నాక్ దౌలత్ రావు, దళిత సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు కాంబ్లే బాబా సాహెబ్, కాంబ్లే బాలాజీ, గైక్వాడ్ దత్తరాజ్, మావాలే దత్త, పుల్లరే విజయ్ కుమార్, భారత్, శ్రీహరి, సోపాన్ ,కాంబ్లే అన్నా రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పెండింగ్ విషయాల తొలగింపు, స్వచ్ఛతపై ప్రత్యేక ప్రచారం 5.0.. విజయవంతంగా పూర్తి చేసిన పర్యాటక శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 14:కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రచారం 5.0 కార్యక్రమంలో పర్యాటక మంత్రిత్వ శాఖ, దాని అనుబంధ సంస్థలు చురుగ్గా పాల్గొన్నాయి.. వీటిలో భారత పర్యాటక సంస్థ కార్యాలయాలు, నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ మొదలైనవి ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో మొత్తం 6,429 లక్ష్యాలను నిర్దేశించగా.. అందులో 6378 విజయాలు సాధించారు. ఈ ప్రక్రియలో మొత్తం 92,749 చదరపు అడుగుల స్థలం ఖాళీ అయ్యింది. చెత్తను విక్రయించడం ద్వారా రూ. 12,69,002 ఆదాయం లభించింది. 4710 ఫైళ్లను తొలగించారు. 1114 ఎలక్ట్రానిక్ ఫైళ్లను పూర్తిచేసి మూసివేశారు. దేశవ్యాప్తంగా 413 స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించి.. ఈ ప్రచారం గురించి అవగాహన కల్పించేందుకు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు.

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు, పర్యాటక రంగానికి చెందిన భాగస్వాములు కూడా స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు తమ కార్యాలయాలు, విద్యాసంస్థల ప్రాంగణాల్లోనే కాకుండా, పర్యాటకులు సందర్శించే ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేశారు. సామూహిక ప్రదేశాలను సైతం శుభ్రపరిచి, పలుచోట్ల చెట్లు నాటే కార్యక్రమాలు చేపట్టారు.

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

## -అంగన్వాడి కేంద్రంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిన కాంగ్రెస్ నేత జంపన

హైదరాబాద్, నవంబర్ 14: భారత మొట్టమొదటి ప్రధాని చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం చిల్డ్రన్స్ డే సందర్భంగా కంటోన్మెంట్ ఒకటవ వార్డు న్యూ బోయినపల్లి బాపూజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సంజీవయ్య నగర్ వీకర్ సెక్షన్ అంగన్వాడి పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై అంగన్వాడీ పాఠశాలల్లో కేక్ కట్ చేశారు. చిన్నారులకు చాక్ లెట్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. అనంతరం బాపూజీనగర్ ప్రభుత్వ పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జంపన ప్రతాప్ బహుమతులు అందజేశారు.

చిన్నారులను నెహ్రూ గులాబీతో పోల్చేవారని, అందుకే ఎల్లప్పుడూ నెహ్రూ గులాబీ ధరించేవారన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వప్న, సూపర్వైజర్ లక్ష్మి, అంగన్వాడీ ఉపాధ్యాయులు హేమలత, బస్తీ అధ్యక్షుడు అశోక్, స్థానికులు రామారావు, హరికృష్ణ, బాపూజీనగర్ పాఠశాల హెచ్ఎం ఆశీర్వాదం, పద్మావతి మేడం, సరితా, శోభారాణి, ఆర్తి, అనిత హరనాథ రావు, విద్యార్థుల తల్లిదండ్రులు వరప్రసాద్, శ్రీకాంత్, ముకేశ్ యాదవ్, పవన్, పాల్గొన్నారు.

# పెద్దవంగరలో క్రిష్ణ హోల్ సేల్ కిరాణం ప్రారంభం



మహబూబాబాద్, నవంబర్ 14:నూతనంగా ఏర్పడిన పెద్దవంగర మండలం దినదినాభివృద్ధి చెందుతుంది. మండలం 2016లో నూతనంగా ఏర్పడినప్పటి నుంచి ప్రజలు నిత్యావసరాల వస్తువులకు ఇతర మండలాలు కొడకండ్ల, తిరుమలగిరి, తొర్రూర్ కు వెళ్లి వారికి అవసరమైన వస్తువులను తీసుకుని తిరిగి వస్తూ ఉండేవారు. ప్రజల అవసరాల నిమిత్తం బొమ్మెరబోయిన క్రిష్ణ పెద్దవంగరలో కిరాణం ఉ ఎగ్ సెంటర్, కూల్ డ్రింక్స్ హోల్ సేల్ ఉ రిటైల్ షాపును ఆయన తోటి మిత్రులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు .. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వస్తువు తొర్రూర్, తిరుమలగిరి, కొడకండ్ల కంటే తక్కువ ధరకు లభిస్తుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అనునిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి వస్తువులను సరసమైన ధరలకు అందిస్తామని తెలిపారు. వివాహ, పుట్టినరోజు వంటి అన్ని శుభకార్యాలకు అవసరమైన వంట సామాగ్రిని ఆర్డర్లపై హోల్ సేల్ ధరలకే సప్లై చేయబడునని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దవంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుమ్మరి రామ్మూర్తి, జ్ఞానేశ్వరచారి,శ్రీశైలం,బుచ్చన్న, రాజు,కిషోర్,నరసయ్య,వెంకన్న, సోమన్న,శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, అమృత రెడ్డి, వెంకట్ రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

# లక్ష్యసాధన కోసం కృషి చేయాలి



హైదరాబాద్, నవంబర్ 14:ప్రతి విద్యార్థి లక్ష్యాసాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ సిక్తపట్నాయక్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ రోజు జిల్లా కేంద్రంలోని పరిమళపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు.

భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "నేటి పిల్లలే రేపటి పౌరులు'' అని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. చదువు సాధనకు మార్గం చూపుతుందని, బాలల దినోత్సవ వేడుకలలో భాగంగా పాఠశాలలో Young Orators Club (YOC) మిడ్-ఇయర్ షోకేస్ నిర్వహించారు.

ఇందులో Picture Talk, Show & Tell, Role Playవంటి కార్యకలాపాల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించిన కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యా యులు, ఒశ్రీనీఎతిబి ఈనీబీనిటజీబితినీని బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీటీసీకి ఎంపీ నగేష్ పరామర్శ

ఆదిలాబాద్, నవంబర్ 14: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని మండలంలోని సాలేవాడ (కె) బీజేపీ మాజీ ఎంపీటీసీ సల్గర్ రవీందర్ తండ్రి సల్గర్ పాండురంగ్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్ ఈరోజు మాజీ ఎంపీటీసీ రవీందర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులనుపరామర్శించారు.

మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపీ తోపాటు ఉట్నూర్ మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ ఎంపీటీసీ కందుకూరి రమేష్, మాజీ కారోబార్ సండే సుభాష్ శ్రీరామే భగవాన్ పాటిల్, మాజీ ఉపసర్పంచ్ జీ భూపతి, నాయకులు కోరంగ నరేష్, సల్గర్ బాబారావు పాల్గొని మాజీ ఎంపీటీసీ రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఘనంగా స్వయంపాల దినోత్సవం..

దండేపల్లి, నవంబర్ 14: బాలల దినోత్సవంను పురస్కరించుకొని ఈ రోజు మండలంలోని వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా అభిరామ్, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఐశ్వర్య, హర్షవర్ధన్, అటెండర్లు గా అశ్విత్, జస్వంత్ వ్యవహరించారు.

ముందుగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ఘటించారు. అనంతరం విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

## ప్రజాపాలనకు ప్రజల గ్రీన్ సిగ్నల్..

హైదరాబాద్, నవంబర్ 14: రాష్ట్ర అభివృద్ధి కోసం గత రెండు సంవత్సరాలుగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి పనులే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకు దారితీశాయని టీపీసీసీ కార్యదర్శి దండుకుల యాదగిరి అన్నారు.

నవీన్ యాదవ్ విజయాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద, హస్మత్‌పేట్ స్టార్ కేఫ్, అంజయ్యనగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరి టపాకాయలు కాల్చి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరిపారు. "రేవంత్ రెడ్డి జిందాబాద్", "కాంగ్రెస్ పార్టీ జయహో" అంటూ నినాదాలు చేస్తూ వాతావరణం ఉత్సాహభరితంగా మారింది.

ఈ సందర్భంగా దండుకుల యాదగిరి మాట్లాడుతూ.. "తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని అడ్డగోలంగా దోచుకొని దివాలా తీసే స్థితికి చేర్చారు. అలాంటి పరిస్థితుల్లో గత రెండు సంవత్సరాలుగా ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు నమ్మకం కలిగించాయి. ఆ విశ్వాసమే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం దక్కడానికి కారణం'' అన్నారు.

కాంగ్రెస్ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు.

# రైళ్లలో చెత్తను క్రమపద్ధతిలో నిర్మూలించేలా జోనల్ రైల్వేలకు విస్తృత మార్గదర్శకాలు జారీ చేసిన రైల్వే బోర్డు

న్యూఢిల్లీ, నవంబర్ 14:రైలు ప్రయాణాల్లో పోగయ్యే చెత్తను క్రమ పద్ధతిలో నిర్మూలించడానికి అన్ని జోనల్ రైల్వేలకూ విస్తృత మార్గదర్శకాల్ని రైల్వే బోర్డు జారీ చేసింది. స్వచ్ఛతను పెంచి, ప్రయాణికులకు మరింత ఆహ్లాదకర అనుభూతులను పంచడమే ఈ ఆదేశాల ముఖ్యోద్దేశం.

ఈ మార్గదర్శకాల్లో ఒక కచ్చితమైన పద్ధతిని సూచించారు. దీని ప్రకారం, ఆన్-బోర్డ్ హౌస్‌కీపింగ్ సేవల (ఓబీహెచ్ఎస్)తో పాటు పాంట్రీ కార్ సిబ్బంది ప్రయాణికుల కంపార్ట్‌మెంట్లలోని చెత్తను ఎత్తి, మార్గంలో ఎంపిక చేసిన స్టేషన్లలో ఏర్పాటు చేసిన సంచుల్లో వేయాల్సి ఉంటుంది. రైళ్ల లోపలే కాక, రైల్వే స్టేషన్లలో కూడా స్వచ్ఛతకు ప్రాధాన్యాన్నివ్వాలన్న ఉద్దేశంతో ఈ వ్యవస్థను రూపొందించారు.

చక్కని ప్రయాణానుభూతిని కలిగించేందుకు ఆన్-బోర్డ్ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధుల్లో కొన్ని కొత్త సూచనలను తాజా ఉత్తర్వులో చేర్చారు. రైలు పెట్టెల్లో, టాయిలెట్లలో చెత్త పోగుపడకుండా పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ, ప్రయాణికులకు సౌఖ్యాన్నీ, భద్రతనూ అందించడంలో ప్రముఖ పాత్రను పోషిస్తున్నది ఈ సిబ్బందే. ముందు వరుసలో నిలిచే వీరిలో చాలా మంది సిబ్బంది కాంట్రాక్టుపై పనిచేస్తున్నారు. వారు బాధ్యతల్ని సేవాభావం ఉట్టిపడేలా సమర్థంగా నిర్వహించడానికి తగిన శిక్షణనీ, అవసరమైన సామగ్రినీ జోనల్ రైల్వేలు అందించితీరాలని బోర్డు ఆదేశించింది.

ఈ విధానాలను క్షేత్ర స్థాయిలో అమలుపరిచేలా చూడడానికి రైళ్లలో పనిచేసే సిబ్బందితో పెద్ద ఎత్తున 'సంవాద్' (చర్చ) కార్యక్రమాన్ని మొదలు పెట్టాలని రైల్వే బోర్డు ఆదేశించింది. ఈ అవగాహన కార్యక్రమాన్ని అన్ని జోనల్ రైల్వేల్లో సీనియర్ సూపర్‌వైజర్లు, వాణిజ్య, మెకానికల్ విభాగాల అధికారులు నిర్వహించాల్సి వుంటుంది. సిబ్బందిని నేరుగా కలుసుకొని, స్వచ్ఛ భారత్ మిషన్లో వారి పాత్రకు ఉన్న ప్రాముఖ్యాన్ని వివరించడంతో పాటు, సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందుల్ని కూడా అర్థం చేసుకోవాలన్నదే ఈ కార్యక్రమ ప్రధానోద్దేశం.

రైళ్లలో ఉండి విధుల్ని నిర్వహించే ఓబీహెచ్ఎస్ సిబ్బందికి సూచనలను చేసే కొన్ని వీడియోలను 'సంవాద్' (చర్చ) సదస్సుల్లో ప్రదర్శిస్తారు. ఇది చెత్త తొలగింపు ప్రక్రియలపై వారికి అవగాహన కలిగిస్తుంది. స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా రైళ్లనూ, రైల్వేస్టేషన్లనూ అద్దంలా ఉంచాలన్న వారి బాధ్యతలను విడమరచి చెప్పడంపై కూడా శ్రద్ధ తీసుకుంటారు. చెత్తనూ, అన్నపానాదుల అనంతరం మిగిలే వ్యర్థ పదార్థాలనూ పోగు చేసి తగిన చర్యలను తీసుకోవడానికి సంబంధించి జారీ చేసిన ఆదేశాలకు తోడు, ప్రతి ఒక్క రైలుకూ నిర్ధారిత స్టేషన్లలో చెత్తను వేయడానికి చేసిన ఏర్పాట్ల గురించి కూడా సిబ్బందికి సమాచారాన్ని అందిస్తారు.

ఓబీహెచ్ఎస్, పాంట్రీ కార్ సిబ్బంది చురుగ్గానూ, బాధ్యతాయుతంగానూ నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సదస్సుల్లో స్పష్టం చేస్తారు. చెత్త తొలగించే సందర్భాల్లో వారికి ఎదురయ్యే ఇబ్బందులు ఎలాంటివో అడిగి తెలుసుకుంటారు. క్షేత్ర స్థాయిలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎమ్), ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎమ్ఈ)ల అభిప్రాయాలకు డివిజన్లు తమ స్పందనను కూడా కలిపి మరీ పంచుకోవాల్సి ఉంటుంది. ఈ దశను పూర్తి చేసిన తరువాత 10 రోజుల లోపల పీసీసీఎమ్ లే ఒక సమగ్ర నివేదికను రైల్వే బోర్డు కార్యనిర్వాహక డైరెక్టరు, టూరిజం, క్యాటరింగ్ కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుంది.

విస్తృత స్థాయిలో చేపట్టే ఈ ప్రక్రియను ఒక నెల రోజుల్లో పూర్తి చేయాలి. దీనిలో భాగంగా అన్ని రైళ్లనూ లెక్కలోకి తీసుకోవాలి. ఇది జరిగాక, డివిజన్ల నుంచి వచ్చిన అభిప్రాయాలను జోనల్ స్థాయిలో సంకలనం చేసి, సమీక్ష కోసం రైల్వే బోర్డుకు పంపుతారు.

నియమావళిని ఖచ్చితంగా పాటించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని కూడా బోర్డు పంపించిన సందేశంలో స్పష్టం చేశారు. ఓబీహెచ్ఎస్, పాంట్రీ కార్ సేవల లైసెన్సులు పొందిన సంస్థలకు ఈ మార్గదర్శక సూత్రాల విషయంలో లాంఛనంగా సూచనలనూ, సలహాలనూ ఇస్తారు. ఏ విధమైన ఉల్లంఘనకు పాల్పడినా, కాంట్రాక్టును అమలు చేయడంలో భంగం కలిగిందని భావించి, దోషులుగా తేలే పక్షాలకు వ్యతిరేకంగా సదరు కాంట్రాక్టును సమాప్తం చేసే దిశగా తగిన చర్యలను తీసుకోవడం మొదలుపెడతారు.

కిందటేడాది జులైలో జారీ చేసిన ఆదేశాలకు తరువాయిగా, ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మార్గమధ్యంలోని స్టేషన్లలో చెత్తను పారబోయడానికి ఒక వ్యవస్థను రూపొందించామని మునుపటి ఆదేశాల్లో పేర్కొన్నారు. చెత్త ఎక్కడెక్కడ పోగవుతోందో అంచనా వేయడానికి ఓ అధ్యయనాన్ని మొదలుపెట్టడం, నిర్దిష్ట స్టేషన్లలో చెత్త సమీకరణకు కనీస సంఖ్యలో ఎన్ని సంచులు ఏర్పాటు చేయాలో సూచించడం, పక్కా పర్యవేక్షణ కోసం ఈ సమాచారాన్నంతా ఓ కేంద్రీకృత నిర్వహణ వ్యవస్థ (సీఆర్ఐఎస్‌కు చెందిన సీఎమ్ఎమ్ వ్యవస్థ)లో పొందుపరచడం వంటి చర్యలు ఈ వ్యవస్థలో భాగంగా ఉన్నాయి.

'సంవాద్' రూపేణా ఖచ్చితమైన విధివిధానాలను భారతీయ రైల్వేలు అనుసరిస్తూ, దీనికి మానవీయ దృష్టికోణాన్ని కూడా జతపరిచి, ఆన్‌బోర్డ్ ఆతిథ్యాన్నీ, పారిశుధ్యాన్నీ, ప్రయాణికులకు మొత్తంమీద కలిగే యాత్రానుభూతినీ మెరుగుపరిచే దిశగా కీలక నిర్ణయాలను తీసుకొంటోంది.

# బాలల రక్షణే లక్ష్యం

### బాలల సంరక్షణ చట్టాల పునశ్చరణ తరగతుల్లో ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



అమరావతి, నవంబర్ 14:బాలల సంరక్షణలో పోలీసు శాఖ ఎల్లవేళలా ముందు ఉంటుందని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అన్నారు. పిల్లల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై పోలీస్ అధికారులు మెరుగైన అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య న్యాయ చట్టం , పోక్సో చట్టం, పిల్లలకు ఇతర చట్టాలపై అవగాహన పెంచేందుకు బాలల సంక్షేమ పోలీస్ అధికారులు, మహిళా సహాయక కేంద్రం సిబ్బంది, శక్తి టీమ్స్, జిల్లా ఒఊుజ బృందంతో ఒంగోలులోని జిల్లా పోలీస్ కళ్యాణ మండపంలో పునశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ, పోక్సో చట్టం, జువెనైల్ జస్టిస్ యాక్ట్2015, బాల్య వివాహాల నిర్మూలన , బాలల సంరక్షణ వంటి కీలక చట్టాలపై పోలీస్ సిబ్బంది మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఈ చట్టాల ప్రకారం పాటించాల్సిన నియమాలను తెలుసుకోవడం, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం తో నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. బాధిత బాలబాలికలకు న్యాయం చేయడంలో చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు.

జిల్లా వ్యాప్తంగా శక్తి బృందాలు బస్టాండులు, ఆర్టీసీ కాంప్లెక్సులు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్ళు, ఈవ్ టీజింగ్ జరిగే ప్రదేశాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద పర్యటిస్తూ ఏ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా పని చేయాలని ఎస్పీ సూచించారు. మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం శక్తి యాప్ ప్రాముఖ్యత, అందించే సేవల గురించి విస్తృత అవగాహన కల్పించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించాలన్నారు. శక్తి కాల్స్, డయల్ 100/112, ఉమెన్ హెల్ప్ లైన్ -181 ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత పోలీసులు చురుకుగా స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

శక్తి టీమ్ ఏర్పాటు చేసినప్పుడు నుంచి 3000 పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 813 ఞాూ కాల్స్ కు వెంటనే స్పందించినట్లు వివరించారు. ఇంకా ఎక్కువ డ్రోన్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తూ స్కూల్/కాలేజీ ల వద్ద విజిబుల్ పోలీసింగ్ చేస్తూ శక్తి యాప్ గురించి తెలియచేస్తూ ఎక్కువగా అవగాహనా కల్పిస్తూ మహిళలు , చిన్నపిల్లలు జరిగే నేరాలను నివారించడంలో కృషి చేయాలని సూచించారు. రెస్పాన్స్ టైమ్ అత్యంత కీలకమన్నారు. బాధితులకు అండగా నిలిచి, సమాజం గుర్తుంచుకునే విధంగా విధులు నిర్వర్తించాలని పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఅఊా పి.డి. ఎస్.సువర్ణ, అఆఖూ పి.ఇవాంజిలెన్, ఆఅఖూ పి.దినేష్, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి.వి. రమణ కుమార్, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ యూ.సుధాకర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ఎఅఊా సిబ్బంది పాల్గొన్నారు.

# మేడారం జాతరకు స్పెషల్ బస్సులు : ఆర్ఎం డి.విజయభాను



హనుమకొండ, నవంబర్ 14: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిచెందిన మేడారం జాతరకు భక్తులందరూ సమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకుని మొక్కులను సమర్పించుకునేందుకు ఆర్టీసీ వరంగల్ రీజియన్ నుంచి స్పెషల్ బస్సులను నడిపిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ మేడారం జాతర సందర్భంగా వరంగల్ రీజియన్ భక్తుల సౌకర్యార్థం హనుమకొండ నుంచి మేడారంకు ప్రత్యేక బస్సులు ఈనెల 16(ఆదివారం) నుంచి నడపడం జరుగుతుందన్నారు.

ఉదయం 6 గంటల నుంచి భక్తుల రద్దీకనుగుణంగా మేడారంకు బస్సులు నడపబడుతుందని, మేడారం ప్రత్యేక బస్సుల ఆపరేషన్ నిర్వహణకు హనుమకొండ బస్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు 24 గంటలు ప్రయాణికుల సేవలకు అందుబాటులో ఉంటారని, అన్ని ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులలో మహిళలకు, ఆడపిల్లలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. ఉచిత ప్రయాణానికి అనుమతించబడుతుందని కావున మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని సురక్షితంగా వారి మొక్కలను తీర్చుకోగలరని కోరారు.

హనుమకొండ బస్టేషన్ నుంచి మేడారంకు బస్సులు బయలుదేరు సమయం: 6.10,7.0 0,8.0 0,9.00,1 2.10,13.00,13. 40,14.30,20.20 మేడారం నుంచి హనుమకొండకు బస్సులు బయలుదేరు సమయం: 5.45,9.45,10.15,11 .15,13.10, 16.00,17 .00,17 .30,18.00 ఛార్జీల వివరాలు: పల్లె వెలుగు బస్సు ఛార్జీలు పెద్దు రూ.130, పిల్లలకు రూ.80, ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీలు పెద్దలకు రూ.180, పిల్లలకు రూ.110. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రైల్ భవన్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన మహిళా క్రికెట్ ప్రపంచ కప్ ఛాంపియన్లు ప్రతీకా రావల్, రేణుకా సింగ్ ఠాకూర్, స్నేహ్ రాణా

న్యూఢిల్లీ, నవంబర్ 14:ఇటీవల ముగిసిన ఐసీసీ మహిళా ప్రపంచ కప్-2025లో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన స్టార్ బ్యాటర్ ప్రతీకా రావల్, బౌలర్ రేణుకా సింగ్ ఠాకూర్, ఆల్ రౌండర్ స్నేహ్ రాణాలు ఈ రోజు న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారు. ఆటలోని ప్రతి కోణానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ముగ్గురు క్రీడాకారిణులు భారత రైల్వేలకు గర్వకారణమైన ఉద్యోగులన్న కేంద్ర మంత్రి... భారత చరిత్రాత్మక ప్రపంచ కప్ విజయం కోసం వారు చేసిన అద్భుత కృషిని అభినందించారు.

ప్రపంచ కప్ గెలిచిన ఛాంపియన్లను కలవడం సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి అన్నారు. భారత మహిళా స్టార్లు తమ ప్రయాణం, మైదానంలో ఎదురైన అనుభవాలను గురించి స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకున్నారని ఆయన తెలిపారు.

ఢిల్లీకి చెందిన ఓపెనింగ్ బ్యాటర్ ప్రతీకా రావల్ నార్తర్న్ రైల్వేలోని ఢిల్లీ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏప్రిల్-2023లో భారతీయ రైల్వేలో చేరారు. ఇటీవలే సీనియర్ క్లర్కుగా పదోన్నతి పొందారు. ప్రపంచ కప్ లీగ్ దశలో గాయం బారిన పడినప్పటికీ టోర్నమెంట్ ఆసాంతం ఆమె తన సహచరులకు నిరంతరం స్ఫూర్తినిస్తూ మద్దతుగా నిలిచారు. తనదైన శైలి బ్యాటింగ్, కచ్చితత్వంతో ఇన్నింగ్స్‌ను నిర్మించే సామర్థ్యానికి పేరుగాంచిన రావల్... ఆటపై లోతైన అవగాహనతో తన ప్రతిభను మిళితం చేస్తుంది. గత సంవత్సరం చివర్లో జరిగిన వన్డే ఇంటర్నేషనల్ టోర్నీ ద్వారా అరంగేట్రం చేసినప్పటి నుంచి... ఆమె ఈ ఫార్మాట్‌లో భారత్ తరపున అత్యంత స్థిరమైన ప్రదర్శన చేసిన వారిలో ఒకరిగా నిలిచారు.

హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కుడిచేతి మీడియం-ఫాస్ట్ బౌలర్ రేణుకా సింగ్ ఠాకూర్ నార్తర్న్ రైల్వేలోని అంబాలా డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిసెంబర్-2020లో భారతీయ రైల్వేలో చేరారు. అప్పటి నుంచి స్థిరమైన మ్యాచ్ విన్నర్‌గా రాణిస్తున్నారు. భారత్ సాధించిన అనేక విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఇటీవలి ప్రపంచ కప్ సమయంలోనూ కీలకమైన మూడు వికెట్లు తీసుకోవడం ద్వారా భారత్ విజయంలో ఆమె గణనీయమైన ప్రభావం చూపారు. జట్టు చరిత్రాత్మక విజయం తర్వాత భారత తొలి మహిళా ప్రపంచ కప్ విజయంలో ఆమె సహకారాన్ని ప్రశంసిస్తూ తన స్వగ్రామంలో నిర్వహించిన వేడుకల్లో రేణుకను గ్రామస్తులు, స్థానిక అధికారులు ఘనంగా సత్కరించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన స్నేహ్ రాణా నార్తర్న్ రైల్వేలోని మొరాదా బాద్ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2018 నుంచి భారతీయ రైల్వేతో అనుబంధం కలిగి ఉన్నారు. కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్, నమ్మకమైన మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌కు పేరుగాంచిన ఆమె... టోర్నమెంట్ లీగ్ మ్యాచ్‌లలో కీలక పాత్ర పోషించారు. స్నేహ్ ఆరు మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లతో తన ప్రపంచ కప్ పోరును ఘనంగా ముగించారు. ఇందులో తన అత్యుత్తమ గణాంకాలు 2/32 కూడా ఉన్నాయి. బ్యాటింగ్‌తోనూ విలువైన పరుగులు అందించిన రాణా 49.50 సగటుతో 99 పరుగులు సాధించారు.

భారతీయ రైల్వే చాలా కాలంగా దేశంలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించే ప్రధాన కేంద్రంగా ఉంది. భారతీయ రైల్వేకు చెందిన అథ్లెట్లు ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి కీర్తిని తెచ్చిపెడుతున్నారు. రైల్వే క్రీడాకారులు తమ అత్యుత్తమ విజయాలకు గానూ అర్జున అవార్డు, పద్మశ్రీ, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాలు అందుకున్నారు.రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ ద్వారా ప్రపంచ స్థాయి శిక్షణ సౌకర్యాలు, ఉద్యోగ భద్రత, సంస్థాగత మద్దతును భారతీయ రైల్వే అందిస్తోంది. సాధారణ కుటుంబాల్లోని అత్యుత్తమ క్రీడా ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తోంది. అర్హులైన క్రీడాకారులు క్రీడల్లో రాణించే అవకాశాన్నీ అందిస్తోంది. స్థిరమైన ఉపాధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు, నిరంతర ప్రోత్సాహంతో భారతీయ రైల్వే జాతీయ, ప్రపంచ వేదికలపై రాణించేలా అథ్లెట్లను శక్తిమంతం చేస్తూనే ఉంది.

# రైతు సంక్షేమానికి సహకార సంఘాల ఏర్పాటు



నార్నూర్ , నవంబర్ 14: రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నామని సహకార సంఘంచైర్మన్ ఆడే సురేష్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలను నిర్వహించారు. సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహకార జెండాను ఆవిష్కరించారు.చైర్మన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సహకార సంఘాలు ఏర్పడడంతో గ్రామాల్లోని రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. రైతులు సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఆడే గణేష్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, డైరెక్టర్లు దుర్గ కాంతారావు, సురేష్, ప్రకాష్, వసంత్, యశ్వంత్ రావు, దిగంబర్, కోరల మహేందర్, మోహన్, నజీర్ తదితరులున్నారు.

# ఉత్తమ పౌరులుగా సమాజాభివృద్ధికి కృషి చేయాలి : హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్



నల్గొండ, నవంబర్ 14:విద్యార్థి దశలోనే దేశభక్తిని ఇనుమడింపజేసుకుని భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పుల్లూరి వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం కోదాడలోని పాఠశాలలో తొలి ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ప్రధాని చాచా నెహ్రూకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జి గోవర్ధన్ రాయుడు, ఉపాధ్యాయులు కన్నయ్య, రవీంద్ర నాయక్, విజయ్, దుర్గాప్రసాద్, సుజాత, బ్రాహ్మణి, శాంతకుమారి, రెహానా, వెంకటరెడ్డి, రాజేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పెద్దపులి దాడిలో రెండు పశువులు మృతి..



మంచిర్యాల, నవంబర్ 14: మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తూ అలజడి సృష్టిస్తుంది. బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని బుగ్గగూడెం శివారు ప్రాంతంతో పాటు దేవాపూర్ రేంజ్ పరిధిలోని ఎగ్గండి శివారులో వేర్వేరుగా పశువుల పై దాడి చేసి హతమార్చింది.

బుగ్గగూడెం, కర్లగట్టం అటవీ ప్రాంతానికి సమీపంలోని రాళ్లవాగు పక్కన ఉన్న పత్తి చేనులోని ఆవుపై పులి దాడి చేసి చంపివేసింది. ఈ ఆవు బుగ్గగూడెం గ్రామానికి చెందిన పల్లె ఎల్లక్కగా ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు. దేవాపూర్ రేంజ్ పరిధిలోని ఎగ్గండి ప్రాంతంలో సైతం మరో ఆవుపై దాడి చేసి హత మార్చింది.

ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో పశువులపై పెద్దపులి దాడి ఘటనలు అధికంగా చోటు చేసుకున్నాయి. సమీప గ్రామాల ప్రజలు, రైతులు, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు కోరారు. పులి సంచారంతో అటవీ శివారు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత : సీడీపీఓ తూముల నిర్మల



నీలగిరి, నవంబర్ 14 : బాలల హక్కు మనందరి బాధ్యత అని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్క సెక్టార్ పరిధిలోని రహమత్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో వివిధ వేషధారణలు నిర్వహించి బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. పిల్లలపై చదు వుపై టీచర్లు శ్రద్ధ చూపి నైపుణ్యాలు పెంచుకునేలా చూడాల న్నారు. ప్రభుత్వం బాలల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని గుర్తించాల న్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలని బాల కార్మిక, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల అక్రమ రవాణ అరికట్టాలన్నారు. ఆడ పిల్లల కోసం బేటి బచావో లాంటి కార్యక్రమాలు అమలులో ఉన్నాయన్నారు. సమస్యలుంటే 1098 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. అంతకుముందు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులకు ఆటపాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయమ్మ, పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు గుత్తా జ్యోతి, కవిత, ప్రేమలత, పర్వీన్, ఖుర్షీదాబేగం, అనిత, ఆయాలు బానుచంద్ర, జ్యోతి, సైదమ్మ తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు కొత్త ఉత్సాహం బలాన్నిచ్చింది

## –బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు కొత్త ఉత్సాహం, బలాన్నిచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రజలు స్పష్టంగా తీర్పునిచ్చారని తెలిపారు. ఇది నిజంగా తమకు సానుకూలమైన అంశమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా .. నియోజకవర్గ స్థానిక నాయకత్వం అద్భుతంగా కష్టపడిందని అన్నారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రాజకీయాలకు కొత్త అయినప్పటికీ అద్భుతంగా పనిచేశారని.. పోరాటం చేశారని అన్నారు. ఆమెకు అభినందనలు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తన పాత్రను అద్భుతంగా పోషించిందని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టడంలో బలంగా బీఆర్ఎస్ పనిచేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇది కొనసాగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడమని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసని అన్నారు. ప్రతి సర్వేలో బీఆర్ఎస్ గెలుస్తుందని ఎలా చెప్పింది.. ఆఖరి మూడు రోజుల్లో ఏం జరిగిందో ప్రజలు చూశారని అన్నారు. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్‌నే అని ప్రజలు స్పష్టం చేశారని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు దాదాపు ఏడు ఉప ఎన్నికలు జరిగాయని కేటీఆర్ తెలిపారు. ఈ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికల్లో కూడా గెలవలేదని గుర్తుచేశారు. దాదాపు ఐదింటిలో తాము గెలిచామని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలో కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకటి రెండు సీట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించామని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలను, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లామని పేర్కొన్నారు. హామీల ఎగవేతను బాకీ కార్డుల రూపంలో ప్రధాన చర్చనీయాంశంగా చేయగలిగామని అన్నారు. ఇది బీఆర్ఎస్ సాధించిన విజయమని స్పష్టం చేశారు.

డైవర్షన్ రాజకీయాలు చేయలేదు

ఎన్నికల్లో లబ్ధి కోసం కులం, మతం పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. బూతులు అస్సలు మాట్లాడలేదని పేర్కొన్నారు. హుందాగా కేవలం ప్రజాసమస్యలపై మాత్రమే కొట్లాడామని తెలిపారు. జనాలకు అవసరమైన పాయింట్లను మాత్రమే చర్చకు పెట్టామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంత కవ్వించేందుకు యత్నించినా కూడా సమన్వయం పాటించామని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశామో కూడా తెలిపామని అన్నారు. 5328 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని లెక్కలతో సహా ప్రజల ముందు పెట్టామని అన్నారు. కాంగ్రెస్ ఎగ్గొట్టిన వాటిని కూడా లెక్కలతో సహా ఇంటింటికీ తీసుకెళ్లామని తెలిపారు. బస్సు చార్జీల పెంపుపై నిరసన, బస్తీ దవాఖానాల్లో పర్యటించి ప్రభుత్వ యంత్రాంగంలో చలనం తీసుకొచ్చాం.. హైడ్రా విధ్వంసంపై ప్రభుత్వాన్ని ఎండగట్టాం.. ఆటో అన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం. హైదరాబాద్‌లో రోడ్ల దుస్థితి విషయంలో కూడా ప్రభుత్వాన్ని కదిలించాం. శాంతి భద్రతల విషయంలో కూడా మా నిరసనను తెలిపాం.' అని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలనే కేంద్ర బిందువుగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని హుందాగా నిర్వహించిందని అన్నారు. తద్వారా ప్రభుత్వం కూడా మాట్లాడకతప్పని అనివార్యత కల్పించామని తెలిపారు. రెండేళ్లలో ఒక్కసారి కూడా సమీక్ష చేయని ముఖ్యమంత్రి.. ఆఖరి రోజు ఆరు గ్యారంటీల మీద సమీక్ష చేయని పరిస్థితి వచ్చిందంటే అది బీఆర్ఎస్ విజయమే అని స్పష్టం చేశారు. రెండేళ్లలో మైనార్టీలకు స్థానం లేదు.. దీనిపై బీఆర్ఎస్ గట్టిగా మాట్లాడి.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాల్సిన అనివార్యతను కల్పించామని అన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడీయిజం గెలిచాయి

### –కాంగ్రెస్‌ది గెలుపే కాదని.. నైతిక విజయం తనదే: మాగంటి సునీతా

హైదరాబాద్ నవంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడీయిజం గెలిచాయని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ అన్నారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. కాంగ్రెస్‌ది గెలుపే కాదని.. నైతిక విజయం తనది, బీఆర్ఎస్‌దే అని ఆమె స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కౌంటింగ్ అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయని అన్నారు. పోలింగ్ రోజున ఎంతో అరాచకం సృష్టించారని తెలిపారు. ఒక మహిళపై అంతమంది రౌడీయిజం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని అన్నారు. నేను ఏం మాట్లాడినా.. కార్యకర్తలను పరామర్శించినా తప్పుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇవాళ ఉదయం నుంచే కౌంటింగ్ హాలులో ఆడవాళ్లపై కాంగ్రెస్ ర్యాగింగ్ మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. ఒక మహిళపై కాంగ్రెస్ నేతలు రౌడీ రాజకీయం చేశారని అన్నారు. ప్రజలను కాంగ్రెస్ భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. గత ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికలకు మధ్య తేడా ఏంటో ప్రజలు గమనించారని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



తిరుపతి, నవంబర్ 14: ఆపద మొక్కులవాడు వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమల ఆలయానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించుకుంటున్నారు. శుక్రవారం విజయ వాడకు చెందిన మోనిష్ వెంకట సత్య ప్రకాష్ అనే భక్తుడు టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం గా అందించారు.

ఈ మేరకు దాత తరపున ప్రతినిధి భూషణ్ తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 24 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 62,129 మంది భక్తులు దర్శించుకోగా 21,026 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు మొక్కుల ద్వారా చెల్లించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.13 ఆదాయం వస్తుందని వివరించారు.

# పాఠశాల విద్య ఉన్నత చదువులకు పునాది : కలెక్టర్ కుమార్ దీపక్



ఆదిలాబాద్, నవంబర్ 14: ఉన్నత చదువులకు పాఠశాల విద్య పునాదిలాంటిదని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కాసిపేట మండలం పెద్దనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి బాలల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శాంతి కపోతాలు ఎగురవేశారు.

కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలలో విద్యార్థులకు ఏకాగ్రత, క్రమశిక్షణ అలవాటు చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడలు , మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. బోరు, ప్రహరీ గోడ నిర్మాణం, త్రాగునీటి వసతిని కల్పించిన పాఠశాల పూర్వ విద్యార్థి గుర్రం రాజేష్ గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి, మాజీ కౌన్సిలర్ కొక్కెర చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, దారిమళ్లింపు వంటి అంశాలపై చర్యలు తీసుకున్న ఎరువుల విభాగం..

న్యూఢిల్లీ, నవంబర్ 14:ఖరీఫ్ తో పాటు ప్రస్తుత 2025-26 రబీ సీజన్లో (ఏప్రిల్ నుంచి నవంబరు) రైతుల ప్రయోజనాలను కాపాడడానికీ, జాతీయ ఎరువుల సరఫరా వ్యవస్థను సురక్షితంగా ఉంచడానికి కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ విభాగం (డీఏ అండ్ ఎఫ్‌డబ్ల్యూ)తో సమన్వయాన్ని ఏర్పరుచుకుని ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఎరువుల విభాగం (డీఓఎఫ్) చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వాలతో అనేక సంయుక్త సమావేశాలను డీఏ అండ్ ఎఫ్‌డబ్ల్యూ కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వ ఎరువుల విభాగం కార్యదర్శి నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో జిల్లాల అధికార యంత్రాంగాలు సమన్వయాన్ని ఏర్పరుచుకుని ఇరు పక్షాలూ కలిసి పనిచేశాయి. ఎరువుల బ్లాక్ మార్కెటింగునూ, దొంగ నిల్వలనూ, ఎరువులను చేర్చవలసిన రైతులకు కాకుండా ఇతర వర్గాలకు మళ్లింపునూ అడ్డుకోవడానికి ఇదివరకు ఎప్పుడూ లేనంత స్థాయిలో దాడులు, తనిఖీలు, సోదాలతో పాటు న్యాయ పరమైన చర్యలను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వాలు చురుకుగా వ్యవహరిస్తూ కఠిన చర్యలను తీసుకుని, దేశంలో అన్ని ప్రాంతాల్లోనూ ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేటట్లు చూశాయి. ఎరువులు సకాలానికి అందేటట్లు చూస్తూ, మార్కెట్లో క్రమశిక్షణను పటిష్ఠపరిచాయి.

పంపిణీ నెట్‌వర్కును పర్యవేక్షించడంలో భాగంగా దేశమంతటా మొత్తం 3,17,054 తనిఖీలు, సోదాలను నిర్వహించారు. బ్లాక్ మార్కెటింగుకు పాల్పడినందుకు 5,119 షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దేశవ్యాప్తంగా 3,645 లైసెన్సులను రద్దు లేదా సస్పెన్షన్ చేయడవే కాకుండా, 418 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకొనే క్రమంలో 667 షోకాజ్ నోటీసులనూ, 202 లైసెన్సుల సస్పెన్షన్, లేదా రద్దుతో పాటు 37 ఎఫ్ఐఆర్లను నమోదు చేశారు. ఎరువులను రైతులకు ఇవ్వకుండా ఇతరత్రా మళ్లించడాన్ని అడ్డుకోవడానికి 2,991 షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, 451 లైసెన్సులను రద్దు, లేదా సస్పెండ్ చేశారు. 92 ఎఫ్ఐఆర్లను నమోదు చేశారు. నిత్యావసర వస్తువుల చట్టంతో పాటు ఎరువుల నియంత్రణ ఉత్తర్వు నియమావళి ప్రకారం నేర నియంత్రణ చర్యలను తీసుకుని, నియమాలను తప్పనిసరిగా పాటించేలా, జవాబుదారీతనం వహించేలా తగిన జాగ్రత్తచర్యలను తప్పక తీసుకోవాలని స్పష్టం చేశారు.

అనేక రాష్ట్రాలు వివిధ చర్యలతో కూడిన సమగ్ర విధానాన్ని అమలుచేస్తున్నాయి. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ నాయకత్వం వహించింది. ఆ రాష్ట్రంలో 28,273 తనిఖీలను నిర్వహించారు. బ్లాక్ మార్కెటింగ్ జరుగుతున్నట్లు గమనించి 1,957 షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 157 ఎఫ్ఐఆర్లను దాఖలు చేయడంతో పాటు 2,730 లైసెన్సుల రద్దు, తాత్కాలికంగా నిలిపివేత చర్యలను తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర, హర్యానా, పంజాబ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ అనేక తనిఖీ బృందాలను రంగంలో దింపి, విస్తృత స్థాయిలో పర్యవేక్షణతో పాటు న్యాయ చర్యలను త్వరితగతిన చేపట్టడం ద్వారా నేరాలను నివారించాయి. మహారాష్ట్రలో సరుకు దారిమళ్లింపునకు సంబంధించిన ఉల్లంఘనల విషయంలో 42,566 తనిఖీలు చేపట్టడంతో పాటు 1,000కి పైగా లైసెన్సులు రద్దు చేశారు. రాజస్థాన్లో11,253 తనిఖీలు పూర్తి చేశారు. వివిధ కేటగిరీల్లో సమగ్ర చర్యలు తీసుకున్నారు. బీహార్లో దాదాపు 14,000 తనిఖీలతో పాటు 500కి పైగా లైసెన్సులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ చర్యలతో పంటకాలాల్లో అత్యంత అవసరమైన సమయాల్లో కృత్రిమ కొరతను అరికట్టడమే కాకుండా, ధరలను ఇష్టానుసారం పెంచకుండా చూశారు.

రాష్ట్ర ప్రభుత్వాలతో నేర నియంత్రణ బృందాలు సమన్వయాన్ని ఏర్పరుచుకుని పనిచేస్తున్నాయి. నాసిరకం ఎరువులను సరఫరా చేసిన కేసుల్లో 3,544 షో కాజ్ నోటీసులను జారీ చేశారు. 1,316 లైసెన్సులను రద్దు , లేదా నిలిపివేత చర్యలు తీసుకున్నారు. ఎరువుల నియంత్రణ ఉత్తర్వు-1985ను కచ్చితంగా పాటిస్తూ 60 ఎఫ్ఐఆర్‌లను దాఖలు చేశారు. సరఫరా వ్యవస్థలో నుంచి నాసిరకం సామగ్రిని తొలగించడానికి అనేక స్థాయుల్లో ఎప్పటికప్పుడు నమూనాలను సేకరించి కఠిన పరీక్షలు నిర్వహించారు. నిర్దిష్ట ప్రమాణాలున్న ఎరువులను మాత్రమే రైతులకు అందించేటట్లు జాగ్రత్తచర్యలను తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్రాల అధికారులు నాణ్యతా తనిఖీలు చేపడుతూ, రైతుల ప్రయోజనాలను కాపాడడంతో పాటు దేశ ఎరువుల పంపిణీ వ్యవస్థ సమగ్రతను పరిరక్షిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అధికారులు డిజిటల్ డ్యాష్‌బోర్డుల సాయంతో, వనరులను సమన్వయం చేసుకుంటూ, నిల్వల సరఫరాను వాస్తవ కాల ప్రాతిపదికన పర్యవేక్షిస్తున్నారు. దొంగతనంగా నిల్వ చేసిన , లేదా స్వాధీనం చేసుకున్న ఎరువులను అధికారులు తిరిగి సహకార సంఘాలకు చేరుస్తున్నారు. రైతుల ఫిర్యాదులపై వెనువెంటనే రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకుంటున్నారు.

చురుకుగా వ్యవహరి స్తున్నందుకూ, నిఘాను నిరంతరం కొనసాగిస్తున్నందుకూ, సమయానుకూల చర్యలు తీసుకుంటున్నందుకూ రాష్ట్ర, జిల్లా పాలనాయంత్రాంగాలు, వ్యవసాయ అధికారులు, నేర నియంత్రణ సంస్థలను ఎరువుల విభాగం ప్రశంసించింది. ఏవైనా అవకతవకలు చోటుచేసుకుంటే వాటిని గురించి ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిందిగానూ, ఎరువుల పంపిణీ పారదర్శకంగా, చట్టబద్ధంగా సాగడానికి తోడ్పడాల్సిందిగానూ రైతులను, డీలర్లను, ఇతర ఆసక్తిదారులను కోరింది. ఎరువులు సక్రమంగా లభిస్తూ ఉండేటట్లు చూడటానికి కట్టుబడి ఉన్నామనీ, పౌరులు అప్రమత్తంగా ఉంటూ ఏ అక్రమం జరిగినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలనీ ఎరువుల విభాగం పిలుపునిచ్చింది.

# జాతీయ బాలల దినోత్సవ వేడుకల్లో పలు మెడల్స్ గెలుచుకున్న కారంగ రిత్విక్

హైదరాబాద్ నవంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )జాతీయ బాలల దినోత్సవ వేడుకలు నల్లకుంట డివిజన్లోని సెంట్ గాబ్రియల్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు స్కూల్ హెడ్మాస్టర్ రమేష్ ఆధ్వర్యంలో జవహర్లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్కూలు సిబ్బంది అందరూ కలిసి ఘనంగా నివాళులర్పించారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో వివిధ రకాల ఆటల పోటీలు వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ పోటీలలో ఆరవ తరగతి చదువుతున్న కారంగ రిత్విక్ పలు పోటీల్లో మెడల్స్ గెలుచుకుని మొదటి స్థానం లో నిలిచారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు ఆటల్లో దీటుగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీవిద్య, రాధా స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సూరత్‌లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను రేపు సందర్శించనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 14:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రేపు గుజరాత్‌లో పర్యటిస్తారు. ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి సూరత్‌లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను సందర్శిస్తారు. ముంబయి-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ కారిడార్ పురోగతినీ ఆయన సమీక్షిస్తారు. ఇది భారత అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఒకటి. ఈ ప్రాజెక్టు ద్వారా దేశం హై-స్పీడ్ కనెక్టివిటీ యుగంలోకి అడుగుపెడుతోంది.

సుమారు 508 కిలోమీటర్లు విస్తరించిన ఈ ప్రాజెక్ట్... గుజరాత్, దాద్రా-నగర్ హవేలీలలో 352 కిలోమీటర్లు, మహారాష్ట్రలో 156 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ కారిడార్ సబర్మతి, అహ్మదాబాద్, ఆనంద్, వడోదర, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్, థానే, ముంబయి వంటి ప్రధాన నగరాలను కలుపుతుంది. భారత రవాణా మౌలిక సదుపాయాల్లో ఒక పరివర్తనాత్మక ముందడుగును ఇది సూచిస్తుంది.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అధునాతన ఇంజనీరింగ్ పద్ధతులతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ 465 కిలోమీటర్లు (దాదాపు 85 శాతం మార్గం) వయాడక్టులపై ఉంది. తద్వారా ఇది తక్కువ భూసంబంధ అంతరాయాలు, మెరుగైన భద్రతను నిర్ధరిస్తుంది. ఇప్పటివరకు 326 కిలోమీటర్ల వయాడక్ట్ పనులు పూర్తయ్యాయి. 25 నది వంతెనలకు గానూ 17 వంతెనల నిర్మాణమూ ఇప్పటికే పూర్తయింది.

బుల్లెట్ రైలు అందుబాటులోకి రావడం ద్వారా ముంబయి-అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం దాదాపు రెండు గంటలకు తగ్గుతుంది. నగరాల మధ్య ప్రయాణాన్ని వేగవంతం, సులభతరం, మరింత సౌకర్యవంతంగా చేయడం ద్వారా ఈ ప్రాజెక్ట్ విప్లవాత్మకంగా మారుతుంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం కారిడార్‌లో వ్యాపారం, పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధినీ ఇది వేగవంతం చేస్తుందని భావిస్తున్నారు.

దాదాపు 47 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన సూరత్-బిలిమోరా విభాగం పనులు చివరి దశకు చేరాయి. సివిల్ పనులు, ట్రాక్-బెడ్ నిర్మాణం పూర్తయ్యాయి. నగరంలోని ప్రపంచ ప్రఖ్యాత వజ్రాల పరిశ్రమ స్ఫూర్తిగా సూరత్ స్టేషన్ నమూనాకు రూపకల్పన చేశారు. ప్రయాణికుల సౌకర్యంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ ఈ స్టేషన్ నమూనాను రూపొందించారు. ఇందులో విశాలమైన వెయిటింగ్ లాంజ్‌లు, రెస్ట్‌రూమ్‌లు, రిటైల్ అవుట్‌లెట్‌లు ఉన్నాయి. సూరత్ మెట్రో, సిటీ బస్సులు, భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో సజావైన మల్టీ-మోడల్ కనెక్టివిటీనీ ఇది అందిస్తుంది.

# 18న నాయి బ్రాహ్మణుల వనమహోత్సవం

– నాయి బ్రాహ్మణ కుల బంధువులారా.. వేలాదిగా తరలిరండి
– నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నాయి
– ఆత్మీయత, అనురాగాలకు వేదికగా నాయి బ్రాహ్మణుల కార్తీకమాస వనసమారాధన
– ఆధ్యాత్మిక, ఆహ్లాదం, ఐక్యమత్యమే లక్ష్యంగా కుటుంబ సమేతంగా తరలిరావాలి
– ఉద్యోగ సంఘ నాయకులు దేవరకొండ సైదులు



ఖమ్మం, సెప్టెంబర్ 14 (నేటినిజం ప్రతినిధి) : ఆత్మీయత, అనురాగాలకు వేదికగా ఈనెల 18న మంగళవారం ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులో గల చెరుకూరి వారి మామిడితోటలో నాయి బ్రాహ్మణుల కార్తీకమాస వనసమారాధన కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయి బ్రాహ్మణులు కుటుంబ సమేతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నాయి, ఉద్యోగ సంఘ నాయకులు దేవరకొండ సైదులు నాయి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కొలిపాక బాబురావు పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆధ్యాత్మికత, ఆహ్లాదం, ఐక్యమత్యమే లక్ష్యంగా నవంబర్ 18న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాయి బ్రాహ్మణులందరూ ఒక కుటుంబంగా ఒక దగ్గరకు రావడం గొప్ప ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి అన్నారు. ఇది భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సంవత్సరం మొదలుకొని ప్రతి సంవత్సరం జరిగే వనమహోత్సవాలు నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి వేదిక అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ వనమహోత్సవంలో పిల్లలు, మహిళలు, యువత పాటలు, ఆటలు, కేరింతలతో మంగళవారం సరదాగా గడిచిపోయి వచ్చే ఐదు వేల మంది నాయి బ్రాహ్మణులకు శాశ్వతంగా గుర్తుండాలన్నారు. నాయి బ్రాహ్మణులు ప్రతి ఒక్కరూ ఇది నా కుటుంబ వనమహోత్సవం అనుకొని ప్రతి ఒక్కరిని తరలించేందుకు, మన బలం, మన ఐక్యతను చాటి చెప్పాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఉద్యోగ సంఘ నాయకులు జిడుగు వెంకట రామకృష్ణ, జిల్లా నాయకులు నంద్యాల నరసింహారావు, రావులపాటి శ్రీనివాస్, సంఘం గౌరవ సలహాదారులు సూత్రాల శ్రీనివాసరావు నాయి, దోమకొండ నాగేశ్వరరావు నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ లు తుపాకుల కృష్ణ నాయి, శ్రీరాముల సైదులు నాయి, శ్రీపతి రామనాథం నాయి, కొలిపాక రాఘవేంద్రరావు నాయి, సహాయ కార్యదర్శి సురభి సందీప్ నాయి, కోశాధికారి అద్దంకి పాపారావు నాయి, ప్రచార కార్యదర్శి చిట్యాల సైదాబాబు నాయి, స్టీరింగ్ కమిటీ సభ్యులు గరిడేపల్లి నవీన్ నాయి, సభ్యులు మాదారపు భిక్షం నాయి తదితరులున్నారు.

# ఘనంగా జన్మదిన వేడుకలు.

ఆదిలాబాద్, నవంబర్ 14: భారత ప్రధాని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గుడిరేవు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నెహ్రూ మన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

జవహర్ లాల్ నెహ్రు పిల్లలు అంటే ఎనలేని ప్రేమ అని, ఎక్కడికెళ్లినా ముందుగా పిల్లలతో గడిపే వాడని తెలిపారు.

సమావేశానికి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు హాజరయ్యారు.

అనంతరం విద్యార్థులు ఆటపాటలతోని ఆనందంగా గడిపారు.

ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సగ్గిడి. లక్ష్మి ఉపాధ్యాయులు రాజశేఖర్, అనిత, సల్మా లచ్చన్న, కర్నె నరేందర్, ఖండు తదితరులు పాల్గొన్నారు.

# 'కర్మ హిట్స్ బ్యాక్' అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పోస్ట్

హైదరాబాద్ నవంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు శుక్రవారం వెలువడిన విషయం తెలిసిందే. ఈ ఫలితాల్లో అధికార కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు.

అయితే ఈ ఫలితాల తర్వాత తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎక్స్‌లో పెట్టిన ఓ పోస్ట్ ఆసక్తికరంగా మారింది. 'కర్మ హిట్స్ బ్యాక్' అంటూ ఆమె పోస్ట్ పెట్టారు. జూబ్లీహిల్స్ ఫలితాల్లో బిఆర్ఎస్ పార్టీ ఓటమిని ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్ పెట్టి ఉంటారని నెటిజన్లు భావిస్తున్నారు.

ఇక ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోల్ అయ్యాయి.

బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డికి 17,061 ఓట్లు వచ్చి.. డిపాజిట్ గల్లంతు అయింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించిన ఏదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు



ఖమ్మం, నవంబర్ 14 (నేటినిజం ప్రతినిధి) : రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి ఫలితంగా శుక్రవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీ తో గెలుపుని ఖమ్మం జిల్లా ఏదులాపురం కాంగ్రెస్ నా యకులు, పొంగులేటి అభిమానులు టపాసులు కాల్చి, స్వీట్స్ పంచి ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఏదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని నవీన్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సమాజ నిర్మాణం తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది

– పిల్లలను స్వేచ్ఛగా వివక్షతరహితంగా పెంచాలి

–"స్మార్ట్ కిడ్జ్ చిల్డ్రన్స్ దే" వేడుకలలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీరామ్



ఖమ్మం, నవంబర్ 14 (నేటినిజం ప్రతినిధి) : సమాజ నిర్మాణం తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం జరిగిన బాలల దినోత్సవ వేడుకలలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీరామ్ తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పర్యవేక్షణలో జరిగిన చిల్డ్రన్స్ డే వేడుకలలో తొలుత భారత దేశ ప్రథమ ప్రధానమంత్రి చాచా నెహ్రూ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీరామ్ మాట్లాడుతూ...తల్లిదండ్రులు తమ పిల్లలను స్వేచ్ఛగా వివక్షత రహితంగా పెంచాలని కోరారు. పిల్లలను సమాజ రుగ్మతల పట్ల నిత్యం అవగాహన కల్పించి చైతన్యం పెంచాలని తెలియజేశారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో చిన్నారులకు పలు రకాల పోటీలను నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. తాను చిన్నప్పుడు స్టేజ్ పైకి వెళ్లిన సందర్భాలు లేవని కానీ ఈ పాఠశాలలో చిన్నారులు అవలీలగా స్టేజిపై అనర్గళంగా మాట్లాడడం, పలు పోటీలలో పాల్గొనడం, లఘు నాటికలలో తమ ప్రావీణ్యాన్ని చూపించడం అద్భుతం అని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు గుడ్ టచ్ బాడ్ టచ్ లపై అవగాహన కల్పించి ప్రవర్తించే విధానాన్ని నేర్పాలని కోరారు. పాఠశాల కరెస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... తమ పాఠశాలలో విద్యార్థులను అన్ని రంగాలలో స్వతంత్రంగా నేర్చుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. చిల్డ్రన్స్ డే తో పాటు జాతీయ పర్వదినాల నిర్వహణ, పిక్నిక్లు, ఇన్నొవేర్ సైన్స్ ఎక్స్పోలు నిర్వహణ వివిధ పోటీలలో ప్రోత్సహించడం, తదితర అన్ని కార్యక్రమాలలో విద్యార్థులు అందరిని వెన్నంటి ప్రోత్సహిస్తున్నామని అందుకే తల్లిదండ్రుల విద్యార్థులు తమ పాఠశాలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు స్టేజిపై లఘు నాటికలను నటనా నైపుణ్యంతో ప్రదర్శించి అబ్బురపరిచారు. 150మంది విద్యార్థులు సమాజంలోని పలు అంశాలను ప్రస్తావిస్తూ ఫాన్సీ డ్రెస్ పోటీలో పాల్గొన్నారు. పలు రకాలు నృత్యాలు పాఠశాల ప్రాంగణాన్ని హోరెత్తించాయి. పోటీల అనంతరం గెలుపొందిన విజేతలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీరామ్, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్యలు బహుమతులు ప్రధానం చేశారు. బాలల దినోత్సవ వేడుకలతో పాఠశాల ప్రాంగణం అంతా ఆనంద ఉత్సవాలతో, కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్‌జీఆర్ఈఏ నల్లగొండ కౌన్సిల్ సమావేశం

నల్లగొండ, నవంబర్ 14 : నలగొండ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగస్తుల అసోసియేషన్ (సామాజిక సేవ) భవనంలో శుక్రవారం జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్ రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ గతంలో అలాగే ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా భవన నిర్మాణం గురించి వివరించారు. పెన్షనర్లకు సంబంధించిన సమస్యల గురించి జిల్లా పక్షాన చేపట్టిన కార్యక్రమాలను తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె. శ్రీశైలం మాట్లాడుతూ.. గత పీరియడ్‌లో సంఘం చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి తమ నివేదిక ద్వారా తెలిపారు. తదుపరి గత కాలానికి చెందిన ఆర్థిక నివేదికను కోశాధికారి జి.మోహన్ రెడ్డి సమర్పించారు. సభ్యులందరూ నివేదికలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సంఘం పెన్షనర్ల సమస్యలు, రావాల్సిన ఐదు కరువు భత్యంల గురించి, ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్య సేవలు సాధించుట, సంఘం పక్షాన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివిధ సందర్భాల్లో నివేదికల ద్వారా అర్జీనిస్తూ చేసిన కృషి గురించి తెలిపారు. భవన కమిటీ అధ్యక్షుడు గాయం నారాయణరెడ్డి ప్రసంగిస్తూ.. జిల్లాలోని వివిధ మండల శాఖలకు భవనాల ఏర్పాటు, నిర్మాణం గురించి జరిగిన ప్రయత్నా లలో ఎదుర్కొన్న సమస్యలు, సాధించిన విషయాల గురించి వెల్లడించారు. తదుపరి ఎన్నికల నిర్వహణ అధికారి కె.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రంగయ్య, అసోసియేట్ అధ్యక్షుడు మోహన్ రావు, ఉపాధ్యక్షులు యుగేందర్ రెడ్డి, ఆంజనేయులు, కృష్ణయ్య, కార్యదర్శులు కె.నారాయణరెడ్డి, బి.లింగయ్య, ఎండీ హుస్సేన్, ప్రచార కార్యదర్శి ఎం.శంకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు సంతోష్ రెడ్డి, యాదగిరి, వెంకట్ రెడ్డి, వివిధ మండలాల నుండి నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# దాల్చిన చెక్కతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు



హైదరాబాద్ నవంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దాల్చిన చెక్క మన అందరి ఇళ్లలోనూ ఉంటుంది. దీన్ని మనం మసాలా దినుసుగా అనేక వంటకాల్లో ఉపయోగిస్తుంటాం. దీన్ని మసాలా వంటకాల్లో ఎక్కువగా వేస్తుంటారు. దాల్చిన చెక్కను వేయడం వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. దాల్చిన చెక్కలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి మనకు కలిగే వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి. దాల్చిన చెక్క మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అయితే పలు ఇంటి చిట్కాల్లో దాల్చిన చెక్కను ఎలా ఉపయోగించాలి, దీంతో ఏమేం లాభాలను పొందవచ్చు అన్న విషయాలపై చాలా మంది ఆలోచిస్తుంటారు. కానీ దాల్చిన చెక్కను చాలా సులభంగా ఉపయోగించవచ్చు. దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

ఆర్థరైటిస్ ఉన్నవారికి దాల్చిన చెక్క ఎంతో మేలు చేస్తుంది. ఒక టీస్పూన్ దాల్చిన చెక్క పొడి, 2 టీస్పూన్ల నీరు, ఒక టీస్పూన్ తేనె కలిపి మెత్తని పేస్ట్‌లా చేయాలి. ఆ మిశ్రమాన్ని నొప్పి ఉన్న చోట రాయాలి. దీంతో ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఒక కప్పు నీటిలో 3 గ్రాముల దాల్చిన చెక్క పొడిని కలిపి రోజుకు రెండు సార్లు తీసుకోవాలి. దీంతో విరేచనాలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగు పడుతుంది. కొద్దిగా దాల్చిన చెక్క పొడి, నిమ్మరసంలను తీసుకుని బాగా కలిపి మిశ్రమంగా చేయాలి. దాన్ని మొటిమలు, మచ్చలు, బ్లాక్ హెడ్స్ పై రాయాలి. కొంత సేపటి తరువాత కడిగేయాలి. ఇలా రోజూ చేయడం వల్ల ఆయా సమస్యలు తగ్గుతాయి. ఆలివ్ నూనెను 100 ఎంఎల్ మోతాదులో తీసుకుని కొద్దిగా వేడి చేయాలి. అందులో ఒక టీస్పూన్ దాల్చిన చెక్క పొడి, 2 టీస్పూన్ల తేనె కలిపి ఆ మిశ్రమాన్ని సీసాలో నిల్వ చేసుకోవాలి. కొంత సేపటి తరువాత దాల్చిన చెక్క పొడి నూనెలో బాగా కలుస్తుంది. ఆ తరువాత ఆ మిశ్రమాన్ని తలకు బాగా రాయాలి. 15-30 నిమిషాల పాటు అలాగే ఉండి కడిగేయాలి. ఇలా తరచూ చేయడం వల్ల జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

అధిక బరువు తగ్గేందుకు..

ఒక కప్పు నీటిని మరిగించి అందులో 1 టీస్పూన్ తేనె, అర టీస్పూన్ దాల్చిన చెక్క పొడిని కలపాలి. ఆ మిశ్రమం ఉన్న పాత్రపై మూత పెట్టి దాన్ని 30 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత అందులో మరికొంత తేనె కలపాలి. ఆ మిశ్రమాన్ని నిద్రించే ముందు సగం తాగాలి. మిగిలిన సగాన్ని మరునటి రోజు ఉదయం పరగడుపునే తాగాలి. ఇలా రోజూ చేస్తుంటే శరరీంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఒక కప్పు నీటిలో ఒక టీస్పూన్ దాల్చిన చెక్క పొడిని వేసి బాగా కలిపి ఆ మిశ్రమంతో నోటిని పుక్కిలించాలి. ఇలా చేస్తే నోట్లో ఉండ బ్యాక్టీరియా నశించి నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. ఒక టీస్పూన్ తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని తీసుకుని బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. కొంతసేపు ఆగాక కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి. ముఖం అందంగా కనిపిస్తుంది.

దగ్గు, జలుబు నుంచి ఉపశమనం..

ఒక కప్పు నీటిని తీసుకుని మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు అందులో పావు టీస్పూన్ దాల్చిన చెక్క పొడి, పావు టీస్పూన్ లవంగాల పొడి, అర టీస్పూన్ అల్లం రసం వేసి కలపాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని గోరు వెచ్చగా ఉండగానే తాగేయాలి. ఇలా చేస్తుంటే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. ఒక టీస్పూన్ నీరు, ఒక టీస్పూన్ దాల్చిన చెక్క పొడిని కలిపి మిశ్రమంగా చేసి దాన్ని నుదుటిపై రాయాలి. తలనొప్పి తగ్గుతుంది. ఒక కప్పు నీటిని బాగా మరిగించాలి. అనంతరం అందులో అర టీస్పూన్ దాల్చిన చెక్క పొడిని వేయాలి. తరువాత 5 నిమిషాలు ఉంచాలి. అనంతరం ఆ మిశ్రమంలో తేనె కలపాలి. దాన్ని రోజుకు రెండు సార్లు తాగాలి. దీంతో నిద్రలేమి సమస్య తగ్గుతుంది. నిద్ర బాగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఇలా దాల్చిన చెక్క పొడిని పలు ఇంటి చిట్కాల్లో ఉపయోగించి దాంతో ఆయా అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# గుజరాత్‌లోని నర్మద జిల్లాలో ఈ నెల 15న ప్రధానమంత్రి పర్యటన

న్యూఢిల్లీ, నవంబర్ 14:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవంబరు 15న గుజరాత్‌లో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12:45 గంటల ప్రాంతంలో నర్మద జిల్లాలోని దేవ్‌మోగ్రా ఆలయంలో దైవదర్శనం, పూజలు చేస్తారు. ఆ తర్వాత 2:45 గంటలకు దేడియాపడను సందర్శించి, ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలలో పాల్గొంటారు. అలాగే, మౌలిక సదుపాయాల కల్పన సహా ?9,700 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ నిర్వహించే సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

దేడియాపడ కార్యక్రమాల్లో భాగంగా ఆయన, గిరిజన సముద్ధరణ సహా ఈ ప్రాంతంలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఉద్దేశించిన అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్నిటికి శంకుస్థాపన చేస్తారు.

ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ (పీఎం-జన్మాన్), ధర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ-జేఏజీయూఏ)ల కింద నిర్మించిన 1,00,000 ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలోనూ ప్రధానమంత్రి పాల్గొంటారు.

గిరిజన విద్యార్థుల కోసం సుమారు ?1,900 కోట్లతో నిర్మించిన 42 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల (ఈఎంఆర్ఎస్)లను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. దీంతోపాటు సామాజిక నేతృత్వ కార్యకలాపాల కూడలిగా ఉపయోగపడే 228 బహుళార్థ సాధక కేంద్రాలను, అస్సాంలోని దిబ్రూగఢ్‌లోగల వైద్య కళాశాలలోని 'సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్', మణిపూర్‌లోని ఇంఫాల్‌లో గిరిజన సంస్కృతి-వారసత్వ పరిరక్షణకు ఉద్దేశించిన 'ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (టీఆర్ఐ) భవనం సహా గిరిజన ప్రాంతాల్లో అనుసంధానాన్ని మెరుగుపరిచేలా గుజరాత్‌లోని 14 గిరిజన జిల్లాలకు 250 బస్సులను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

గిరిజన ప్రాంతాల అనుసంధానాన్ని మెరుగు పరిచే లక్ష్యంగా 748 కిలోమీటర్ల కొత్త రహదారులతో పాటు 'డీఏ-జేఏజీయూఏ' కింద సామాజిక కూడళ్లుగా పనిచేసే 14 ట్రైబల్ మల్టీ-మార్కెటింగ్ సెంటర్ల (టీఎంఎంసీ) నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. మరోవైపు గిరిజన బాలలకు నాణ్యమైన విద్యా ప్రదానంపై ప్రభుత్వ నిబద్ధతను కొనసాగిస్తూ ?2,320 కోట్లకుపైగా విలువైన 50 కొత్త 'ఈఎంఆర్ఎస్'లకూ ఆయన పునాదిరాయి వేస్తారు.

# అల్ఫోర్స్ లో ఘనంగా నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలు

– ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థుల నృత్యాలు, వేశాధారణ



కరీంనగర్, నవంబర్ 14: కరీంనగర్ పట్టణంలోనిస్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్, అల్ఫోర్స్ టైనీ టాట్స్, అల్ఫోర్స్ ప్రైమరీ క్యాంపస్, మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్, భగత్ నగర్ లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల, కిసాన్ నగర్ లోని అల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలకు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు వినోదాత్మక కార్యక్రమాల నిర్వాహణ ద్వారా వారిలో దాగివున్న ప్రతిభను వెలికితీయవచ్చని, చదువులో ఆసక్తి పెంపొందించగలుగుతామని తెలిపారు. ప్రతి విద్యార్థి తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను ఎప్పటికప్పుడు సాధన చేసి పలు పరీక్షలలో విజేతలుగా ఉండాలని సూచించారు. పండిట్ నెహ్రూ పిల్లలకు ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని, పిల్లల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయింపు ఎంతో అవసరమని వారు తెలిపారని గుర్తు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రధానంగా చిన్నారులకు వినోదాత్మకంగా విద్యను అందిస్తున్నామని, చదువులో ఆసక్తి పెంపొందించడానికి పలు వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని ఉత్సాహపరుస్తున్నామని చెప్పారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు వివిధ కార్యక్రమాలను, క్రీడల పోటీలను నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి "హమారా చాచా నెహ్రూ - హమారా పండిట్ నెహ్రూ" "మేము బాలలం- భవిష్యత్తుకు పునాదులం" నృత్యాలు చాలా ఆకర్షణంగా నిలిచాయి. పలువురు విద్యార్థులు నెహ్రూ వేషధారణలో విచ్చేసి ఉత్సవాలకు మరింత వన్నె ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ గెలుపుతో కాంగ్రెస్ పార్టీ కనీసం పదేళ్లు అధికారంలో కొనసాగడం తథ్యం

–టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ నవంబర్ 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని టిపిసిసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ గెలుపుతో కాంగ్రెస్ పార్టీ కనీసం పదేళ్ళ అధికారంలో కొనసాగడం తథ్యం మన్నారు. ఈ గెలుపు కష్టపడిన ప్రతి కార్యకర్తకు అంకితం అని.. అన్నారు. నిజామాబాద్ లో ఆయన మీడియా మాట్లాడుతూ.. సమావేశం అయ్యారు. జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు బిఆర్ఎస్ కు సెలవు చెప్పారని, రాష్ట్రంలో బిఆర్ఎస్ కు చోటు లేదని మరోసారి రుజువైందని తెలియజేశారు. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆంక్షాలకు అనుగుణంగా ప్రజాపాలన జరుగుతుందని, నవీన్ యాదవ్ ను గెలిపించిన ఘనత.. సిఎం, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది అని..కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు సాధించడం ఖయామని, కాంగ్రెస్ పార్టీ కనీసం పదేళ్ల అధికారంలో కొనసాగడం తథ్యం అని మహేష్ గౌడ్ అన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపు హర్షణీయం

– కాంగ్రెస్ నేత, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.నరేందర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14(నేటినిజం ప్రతినిధి):జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపుపై కాంగ్రెస్ నేత, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని, పలు రంగాలలో అభివృద్ధి సాధించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రధానంగా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం కలుగుతుందని తెలిపారు. ప్రతిసాత్మకంగా నిర్వహించినటువంటి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గొప్ప నిదర్శనమని, వారి చేస్తున్న కృషికి ప్రతీక అని వారు తెలియజేశారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తూ కార్యకర్తల్లో భరోసా కల్పిస్తూ అన్ని రంగాలలో ఘనవిజయం వైపు ప్రజా ప్రభుత్వం పయనిస్తున్నదని పేర్కొన్నారు. భారీ మెజారిటీతో గెలుపొందిన నవీన్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలిపారు. సమిష్టి కృషితో ఈ విజయం సాధించడం జరిగినదని అభిప్రాయపడ్డారు. ఈ విజయం రానున్న రోజుల్లో నిర్వహించేటువంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం విజయం సాధించడానికి ఊపునిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే విజయం పరంపరను కొనసాగిస్తామని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి చేయూతనిస్తుందని చెప్పారు. ఈ చారిత్రాత్మక గెలుపుకు సహకరించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, మంత్రివర్గ సభ్యులకుగ్ శాసనసభ్యులకు, శాసనమండల సభ్యులకు, పలు కార్పొరేషన్ల చైర్మన్లకు, ప్రధానంగా కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు కీం ఫహాద్, గుర్రం వాసు గౌడ్, తాళ్లపల్లి శ్రీకాంత్, అజీమ్, మాడుగుల ప్రవీణ్, అఖిలేష్ గౌడ్, రాహుల్ గౌడ్, ఆశిష్ గౌడ్, ఎన్ఎస్యుఐ నాయకులు అనిల్, మాజీ ఏఐసిసి మెంబర్ ఆనంద్ యాదవ్, జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సిరిశెట్టి రాజేష్ గౌడ్, పీడీఎస్యు రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎర్రోళ్ల మల్లేశం, అన్ని కాంగ్రెస్ అనుబంధ సంఘాల కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపుపై కాంగ్రెస్ నేతల సంబరాలు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14(నేటినిజం ప్రతినిధి):జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను దాదాపు 25 వేల ఓట్ల మెజారిటీతో గెలవడంపై వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం తిప్పాపూర్ బస్టాండ్ లో బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడంతో ప్రజల సుఖసంతోషాలతో ఉన్నారని, ఎన్నికల సమయంలో కేటీఆర్ హైడ్రా పేరుతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారని, అయినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని, బిజెపి, బిఆర్ఎస్ మాటలను ప్రజలు పట్టించుకోలేదని, జూబ్లిహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు నిరూపించారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడానికి జూబ్లీహిల్స్ ఎన్నిక శుభసూచకమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి నాయకులు కూరగాయల కొమరయ్య, వస్తాది కృష్ణ, అన్నారం శ్రీనివాస్, ఇప్పపుల అజయ్, పుల్కం రాజు, పులి పులి రాంబాబు, నాగుల రాము, ముంజ ఉపేందర్, కోయల్ కార్ మస్తాన్, కోలాకాని రాజు, అబ్దుల్ రజాక్, కట్కూరు శ్రీనివాస్, నాగుల విష్ణు, నాగుల రవీందర్, కొక్కుల బాలు, అంబాటి చందు, సాబీర్, మగ్రిపల్లి రాజు, జగదాంబ గణేష్, తదితరులు తదితరులున్నారు.

# కిడ్స్ కాన్వెంట్‌లో ఆకట్టుకున్న చిల్డ్రన్స్ డే

– ఉపాధ్యాయ వేషాధరణలో విద్యార్థుల ప్రత్యేక ఆకర్షణ

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో శుక్రవారం ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఉపాధ్యాయ వేశాధరణలో విద్యార్థులు ఆకర్షణగా నిలిచారు. అనంతరం నృత్యాలు, ఉపన్యాసాలతో అలరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించడం ఎంతో గొప్ప అనుభూతి కలిగించిందని, ఉపాధ్యాయులు చేసే కృషి ఎంత గొప్పదో తమకు అర్థమైందని విద్యార్థులు తెలిపారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా సమాజ సేవ చేస్తామని తెలియజేశారు. తదనంతరం కిడ్స్ కాన్వెంట్ స్కూల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను శాలువాల మతో సన్మానించి, గౌరవించారు మ. అనంతరం ఉపాధ్యాయులు చిన్నారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కిడ్స్ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్, డైరెక్టర్ ఫసీ, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా టీచర్స్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్, మెడికవర్, ఐఎంఏ అధ్వర్యంలో ప్రపంచ డయాబెటిస్ డే

– వేములవాడలో ఉల్లాసంగా 2కే వాక థాన్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో శుక్రవారంలయన్స్ క్లబ్, ఐఎంఏ, కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారు సంయుక్తంగా ప్రపంచ డయాబెటిస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్, కొల్లిపాక నరసయ్యలు హాజరై, డయాబెటిస్ పై అవగాహన కల్పించారు. షుగర్ వ్యాధి నియంత్రణ, అనర్థాలను వివరించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ వైద్యులు బీరకాయల లోకేష్ డయాబెటిస్ లైఫ్ స్టైల్ మోడిఫికేషన్ ద్వారా డయాబెటిస్ నియంత్రించవచ్చని తెలియజేశారు.

క్రిటికల్ కేర్ ఫిజిషియన్ డాక్టర్ మణి ప్రసాద్ రెడ్డి డయాబెటిస్ వల్ల వచ్చే పక్షవాతం, గుండెపోటుపై వివరించారు. ఇందులో భాగంగా జిఆర్బిఎస్టెస్ట్ లు నిర్వహించారు. తదనంతరం సినారె కళామందిర్ చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు వాక్థాన్ నిర్వహించరు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ వైద్యులు బీరకాయల లోకేష్,మణి, ప్రసాద్ రెడ్డి, లయన్స్ క్లబ్‌జిల్లా అధ్యక్షులు కొల్లిపాక నరసయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ కొయినేని ప్రవీణ్, ట్రెజరర్ డాక్టర్ ఆనంద్ రెడ్డి, తీగల వెంకటేశ్వరరావు, చీకోటి నాగరాజు, అడ్వకేట్ పురుషోత్తం, తిరుమల గౌడ్, గడప రఘుపతిరావు, ఐఎంఏ వేములవాడ డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ ఆర్ ప్రవీణ్ వర్మ, డాక్టర్ అనిల్, డాక్టర్ దీప్తి, లయన్స్ క్లబ్ సభ్యులు, మెడికార్ మార్కెటింగ్ సిబ్బంది శ్రీకాంత్, లక్ష్మీరాజం పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు హర్షణీయం

–రాజన్నకు కోడె మొక్కు చెల్లించిన నాగుల విష్ణు ప్రసాద్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14(నేటినిజం ప్రతినిధి):: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందడంపై రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగుల విష్ణు ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శుక్రవారం భీమేశ్వర స్వామి వారి ఆలయంలో కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఈ గెలుపు కాంగ్రెస్ పార్టీకి శుభ సూచికమని, ప్రజలు పాలన వైపే మొగ్గు చూపుతున్నారని స్పష్టమైందని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని జోస్యం పలికారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**

RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.